


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 333, పేజీలు - 08

శనివారం, ఏప్రిల్ 26, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# కాళేశ్వరం కథ కంచికేనా.?

### - లక్ష కోట్లు గోదావరిలో వేసినట్లేనా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ఆసియాలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌గా గత కేసీఆర్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. ఈ ప్రాజెక్టుతో కొత్తగా లక్ష ఎకరాలు సాగులోకి వచ్చినట్లు చెప్పుకుంది. కాళేశ్వరం నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామలమైందని కేసీఆర్‌తోపాటు, నాటి మంత్రులు ఊదరగొట్టారు. సుమారు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రారంభించిన మూడేళ్లకే కుంగిపోయింది. బుంగలు పడ్డాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కాళేశ్వరం కుంగుబాటు కూడా ఓ కారణం. కాళేశ్వరం ఎంతో గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం హయాంలోనే కీలకమైన లక్ష్మీ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్ల వద్ద బుంగలు పడ్డాయి. నిర్మాణ లోపాలు బయటపడ్డాయి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్, రాష్ట్ర రైతాంగానికి సాగునీరు అందించి రాజకీయంగా దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తుందని భావించింది. అయితే, 2023 ఎన్నికలకు ముందు మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు బయటపడటంతో ఈ ప్రాజెక్ట్ బీఆర్ఎస్‌కు భారంగా మారింది. ఇప్పుడు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమర్పించిన నివేదిక మరో షాక్ ఇచ్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని, వీటిని ఉపయోగిస్తే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని తేల్చింది.



### ఎన్డీఎస్ఏ నివేదిక..

14 నెలల సుదీర్ఘ అధ్యయనం, పలు పరీక్షల తర్వాత ఎన్డీఎస్ఏ సమర్పించిన నివేదిక ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మూడు బ్యారేజీల డిజైన్, నిర్మాణంలో తీవ్ర లోపాలు ఉన్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీకెంట్ పైల్స్ కూలిపోవడంతో పాటు, బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో రంధ్రాలు ఏర్పడినట్లు గుర్తించారు. ఈ బ్యారేజీలను యథావిధిగా ఉపయోగించకుండా, పూర్తిగా రీడిజైన్ చేసి నిర్మించాలని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ లోపాల కారణంగా బ్యారేజీలు శాశ్వత నష్టానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

### భూసార పరీక్షలు, నిబంధనల ఉల్లంఘన

ఎన్డీఎస్ఏ నివేదికలో మరో కీలక అంశం బయటపడింది. బ్యారేజీల నిర్మాణానికి ముందు అవసరమైన భూసార పరీక్షలు నిర్వహించలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సిఫారసు చేసిన స్థలాలకు బదులు, ఇతర ప్రాంతాలకు మార్చడం జరిగింది, ఇది నిర్మాణ స్థిరత్వాన్ని దెబ్బతీసింది. అంతేకాదు, జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం, వర్షాకాలానికి ముందు బ్యారేజీల భద్రతా తనిఖీలు చేయాల్సిన నిబంధనను కూడా పాటించలేదని నివేదిక వెల్లడించింది.

### రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఎన్డీఎస్ఏ నివేదిక కీలక ఆధారంగా మారనుంది. ఈ నివేదిక బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేసీఆర్‌లను ప్రశ్నల వరుసకు గురిచేసే అవకాశం ఉంది. రాజకీయంగా, ఈ నివేదిక బీఆర్ఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారి, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లోపాలను హైలైట్ చేస్తూ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది.

### రైతులపై ప్రభావం..

కాళేశ్వరం ప్రాజెక్ట్ రైతులకు సాగునీరు

2లో..

## పాక్ పౌరులను వెనక్కి పంపించండి

### - అన్ని రాష్ట్రాల సీఎంలకు అమిత్ షా ఫోన్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో మంగళవారం జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ కీలక చర్యలకు దిగింది. రెండు దేశాల మధ్య ఇప్పుడు యుద్ధ వాతావరణం నెలకొంది. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ-సీసీఎస్ 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో ప్రధానంగా దేశంలో ఉంటున్న పాక్ జాతీయులను తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. గతంలో పాక్ వాసులు భారత్‌లో పర్యటించేందుకు సార్క్ వీసా పొడిగింపు పథకం కింద అవకాశం కల్పించారు. తాజా ఉగ్రదాడి నేపథ్యంలో వారందరూ 2 రోజుల్లోగా భారత్‌ను ఖాళీ

2లో..

## సింధూ జలాలు ఆపితే మీ శ్వాస ఆపేస్తాం

### - మోదీకి లష్కరే తోయిబా చీఫ్ వార్నింగ్

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** "నీళ్లు ఆపేస్తే మోదీ శ్వాస ఆపేస్తాం. కశ్మీర్ నదుల్లో హిందువుల రక్తం పారిస్తాం. యుద్ధం మొదలు పెడతాం. మీ అంతు చూస్తాం" అంటూ వరల్డ్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన సభలో అతడు ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌కు నీళ్లు ఆపుతారా, మీ ఊపిరి ఆపేస్తాం జాగ్రత్త అంటూ

2లో..



## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

### - వివిధ అంశాలపై చర్చ - అమరావతి పునర్నిర్మాణం పనులకు ఆహ్వానం

### - ఎలాంటి నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోదీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా చంద్రబాబు స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి దేశాన్ని తీవ్ర వేదనకు గురిచేసింది. ఇటువంటి పిరికిపంద హింసను ఎంత ఖండించినా సరిపోదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజలు బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తారు. భారతదేశ భద్రతను కాపాడటంలో ప్రధాని మోడీ నిర్ణయాత్మక నాయకత్వానికి మేము పూర్తి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము అని చంద్రబాబు ఎక్స్



2లో..

## ఎన్డీఎస్ఏ నివేదిక చూసి వాళ్లంతా సిగ్గుపడాలి

### - మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన తుది

2లో..

## మంత్రులు అప్రమత్తంగా ఉండాలి

### - రేవంత్ రెడ్డి ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారన్న కేటీఆర్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి తమ కేబినెట్‌లోని మంత్రుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారని అన్నారు. శుక్రవారం ఒక మీడియా సంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులంతా అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి తన పదవికి ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనన్న భయం పట్టుకుందని, అందుకే నిత్యం భయపడుతూ మంత్రుల ఫోన్లను ట్యాపింగ్ చేయిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, బీఆర్ఎస్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుంటే, బీజేపీ నేతలు ఆయనకు మద్దతు పలుకుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆయన మండిపడ్డారు.రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కేటీఆర్

2లో..



## పీవోకేను భారత్‌లో కలపాలి

### - ఈ విషయంలో మోదీకి మద్దతు

- పహల్గామ్ దాడిపై హైదరాబాద్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ
- కలిసికట్టుగా ఉగ్రవాదంపై పోరాడాలన్న ముఖ్యమంత్రి
- పాక్‌కు బుద్ధి చెప్పాలన్న రేవంత్ రెడ్డి
- అభివృద్ధి పథంలో నడుస్తున్న దేశంపై దాడి చేశారని ఆగ్రహం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉగ్రవాదంపై పోరులో యావత్ భారతదేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అండగా ఉంటుందని, పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నా మోదీకి మద్దతు ఇస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

2లో..



## తట్టాబుట్టా సర్దేయండి.. లేదంటే కఠిన చర్యలు

### - పాకిస్థానీలకు తెలంగాణ డీజీపీ అల్టిమేటం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన మారణహోమం నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్ రెడ్డి రాష్ట్రంలోని పాకిస్థాన్ జాతీయులకు కఠినమైన అల్టిమేటం జారీ చేశారు. తెలంగాణలో ఉన్న పాకిస్థానీయులందరూ తక్షణమే భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించారు. డీజీపీ జితేందర్ రెడ్డి శుక్రవారం రోజున మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 200 మందికి పైగా పాకిస్తానీయులు ఉన్నట్లు సమాచారం అందిందని డీజీపీ తెలిపారు. వారి వీసాలు ఈ నెల 27వ తేదీ తర్వాత చెల్లుబాటు కావని తేల్చి చెప్పారు. మెడికల్ వీసాలపై ఉన్నవారికి కూడా ఈ నెల 29వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంటుందని,

2లో..

## మోదీ సర్కార్ ఏం చేసినా మా మద్దతు

### - పహల్గాం బాధితులకు రాహుల్ పరామర్శ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉగ్రవాదానికి భారతీయులందరూ ఐక్యంగా ఉండటం అవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్ లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఉగ్రదాడి బాధితులను కలిసి పరామర్శించి భరోసా



2లో..

## ఉగ్రవాదులు వేరు ముస్లిం సమాజం వేరు

### - అందరినీ నిందించడం సరికాదన్న పవన్ కళ్యాణ్

పిఠాపురం (ప్రశ్న న్యూస్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పర్యటించారు. పిఠాపురంలో పలు అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం వేరు శాంతి భద్రతలు కోరుకునే ముస్లిం సమాజం వేరని పవన్ కళ్యాణ్



2లో..

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటిన ఎంఐఎం

### - బీజేపీకి భారీ షాక్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ 63 ఓట్లతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికలో ఎంఐఎం, బీజేపీ మాత్రమే పోటీలో నిలిచాయి. ఈ స్థానానికి 22 సంవత్సరాల విరామం తర్వాత ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు కాంగ్రెస్, బీఆర్ఎస్ దూరంగా ఉండగా బీజేపీ

2లో..

## మావోయిస్టులపై ఉక్కుపాదం

### - మూడు రాష్ట్రాల సరిహద్దులో భీకర ఆపరేషన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా భద్రతా బలగాలు అతిపెద్ద ఆపరేషన్ చేపట్టాయి. కర్రెగట్ట, నాడ్‌పల్లి, పూజారి కాంకేర్ అటవీ ప్రాంతాల్లోని 'మావోయిస్టు బెటాలియన్ నెం.1' స్థావరాన్ని లక్ష్యంగా



2లో..

## కాళేశ్వరం కథ కంచికేనా.?

అందించడంలో కీలక పాత్ర పోషించాలని భావించారు, కానీ ఈ బ్యారేజీలు పనికిరాకపోవడం రైతాంగానికి నష్టం కలిగిస్తుంది. ప్రభుత్వం ఇప్పుడు బ్యారేజీల రీడిజైన్, పునర్నిర్మాణంపై దృష్టి సారించాల్సి ఉంది. ఇది భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది.

## పాక్ పౌరులను వెనక్కి పంపించండి

చేసి తిరిగి పాకిస్తాన్ వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇక మెడికల్ వీసాలపై భారత్‌కు వచ్చిన వారు కూడా వెళ్లాలని పేర్కొంది. దీంతో చాలా మంది పాక్ వాసులు సరిహద్దు దాటుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో ఉన్న పాక్ పౌరులను వెనక్కి పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే కేంద్రమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల సీఎంలతో శుక్రవారం మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ముందుగా ఆ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే వారి వీసాలను రద్దు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పాకిస్తాన్ పౌరులకు జారీ చేసిన వీసాలను కేంద్రం రద్దు చేసింది. దీంతో చాలా మంది అట్టారీ–వాఘా సరిహద్దు వద్దకు భారీగా తరలివచ్చారు. తాజాగా అమిత్ షా ఇచ్చిన ఆదేశాలతో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి. ఆయా రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్తాన్ వాసుల కోసం జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో కూడా పాకిస్తాన్ పౌరుల కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 208 మంది పాక్ జాతీయులు ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు వారందరి వివరాలను సేకరించి రెండు రోజుల్లో నగరాన్ని వీడి తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశించారు. పాకిస్తాన్ వాసులకు జారీ చేసిన వీసాలు అన్నీ ఏప్రిల్ 27వ తేదీ నుంచి రద్దు అయినట్లేనని విదేశాంగ శాఖ ఇప్పటికే ప్రకటించింది. పాక్ జాతీయులకు జారీచేసిన మెడికల్ వీసాలు మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు చెల్లుబాటు అవుతాయని కేంద్రం తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా భారత్‌లో ఉన్న పాక్ పౌరులు మొత్తం దేశాన్ని వీడాలని ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో పాకిస్తాన్‌లో ఉన్న భారతీయులందరూ త్వరగా స్వదేశానికి తిరిగి రావాలని కోరింది.

## సింధూ జలాలు ఆపితే మీ శ్వాస ఆపేస్తాం

హఫీజ్ సయీద్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి హెచ్చరించాడు. సింధూ నదిలో నీళ్లకు బదులు మీ రక్తం పారిస్తామని సంచలన వ్యాఖ్యలు చేశాడు. మేం బంగ్లాదేశ్‌ను విడదీశామని ఢాకాలో నిలబడి చెబుతున్నారా? అని మోదీపై ధ్వజమెత్తాడు. ఇందుకోసం నువ్వూ రక్తం ఇచ్చావని చెబుతున్నావ్ కదా అంటూ తీవ్ర విమర్శలు గుప్పించాడు. మేం మౌనంగా ఉండేది లేదని, నువ్వు అంటే మేమూ అంటామని హఫీజ్ సయీద్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. కశ్మీర్‌లో డ్యాం కట్టి పాకిస్థాన్‌కు నీళ్లు ఆపుతారా, మేం ఊరుకుంటామని అనుకుంటున్నారా? అని మండిపడ్డాడు.

ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, మే 2న అమరావతి పునర్ ప్రారంభ పనులకు ప్రధాని మోడీని చంద్రబాబు ఆహ్వానించారు. సుమారు రూ. లక్ష కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రోడ్ మ్యాప్ తయారు చేసింది. వెలగపూడి సచివాలయం వెనుక అమరావతి పునర్ ప్రారంభ పనులకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 5 లక్షల మంది ఈ సభకు వస్తారని అంచనా వేస్తున్నారు. అదే రోజు రోడ్ షో కూడా ఏర్పాటు చేస్తున్నారు. రూ. లక్ష కోట్ల పనుల ప్రారంభ సూచికగా ప్రధాని మోదీ, పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. ప్రధాని మోదీతో భేటీ సమయంలో అమరావతి, ఏపీకి సంబంధించిన వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించినట్లు తెలిసింది. రాయలసీమ అభివృద్ధిపై కూడా చర్చించినట్లు సమాచారం. రాయలసీమలో పారిశ్రామిక కారిడార్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఏవియేషన్, డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు కేంద్రం సహకారం కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పెండింగ్ సమస్యలపై మోడీతో చంద్రబాబు చర్చించారు. వీరి భేటీ దాదాపు గంటన్నరపాటు జరిగింది. ప్రధానమంత్రి మన రాజధాని నగరం కోసం తన దార్శనిక సూచనలను కూడా పంచుకున్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించడానికి మేము వాటిని అమలు చేస్తాము. సమావేశంలో, ఆంధ్రప్రదేశ్‌లోని కీలక అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా నేను ఆయనకు వివరించాను. కేంద్ర ప్రభుత్వం నిరంతర మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపాను అని చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఎన్డీఎస్ఏ నివేదిక చూసి వాళ్లంతా సిగ్గుపడాలి

నివేదిక తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నివేదికపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. శుక్రవారం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్టు కట్టారు. మీరే డిజైన్ చేశారు, మీరే కట్టారు, మీరు అధికారంలో ఉండగానే కూలిపోయింది." అని ఆయన దుయ్యబట్టారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నాయని, ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసినవారు, చేయించినవారు రైతులకు ద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. "బీఆర్ఎస్ అబద్ధాలు, తప్పులపై బతకాలని అనుకుంటోంది, అది కుదరదు" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు.. ఎన్డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ఎన్డీఎస్ఏ నివేదిక కాదని, ఎన్డీఏ నివేదిక అని ఆయన విమర్శించారు. "బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి రాసిన నివేదిక ఇది" అని ఆయన ఆరోపించారు. ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, మేడిగడ్డను చూడకుండానే, అక్కడ ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిందని ఆరోపించారు. గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి 141 మంది మరణిస్తే, బీహార్‌లో రోజూ బ్రిడ్జిలు కూలుతున్నా ఎన్డీఎస్ఏ స్పందించలేదని ఆయన గుర్తు చేశారు. సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలిపోయినా, ఎస్ఎల్ బీసీ టన్నెల్ కూలి 60 రోజులు అయినా ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. "కేవలం బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే ఈ రకమైన రిపోర్టు ఇచ్చారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏ రకంగా పనిచేస్తున్నాయో అందరికీ తెలుసు. ఎన్డీఎస్ఏ రిపోర్టు డిసెంబర్‌లో వస్తే, ఇప్పుడు సరిగ్గా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రెండు రోజుల ముందు బయటకు తీస్తున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక, దాని విశ్వసనీయతపై ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నివేదికపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

## మంత్రులు అప్రమత్తంగా ఉండాలి

ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలో కూడా వంద శాతం రుణమాఫీ జరగలేదని అన్నారు. రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మరోసారి సవాల్ విసిరారు. ఢిల్లీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునే హడావిడిలో ముఖ్యమంత్రి ఉంటే, మంత్రులు రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలా అని ఆలోచిస్తున్నారని విమర్శించారు. కొందరు పెద్దల ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గాలి మాటలేనని, వీటిని నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు. మోసపు హామీలతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలు ఇప్పుడు వాస్తవాన్ని గ్రహించారని, అందుకే కేసీఆర్ సభల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని కేటీఆర్ తెలిపారు.

## మావోయిస్టులపై ఉక్కుపాదం

చేసుకుని ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. సుమారు 10,000 మంది ఎలైట్ కమాండోలు ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. ఛత్తీస్‌గఢ్ డీఆర్జీ, తెలంగాణ గ్రేహౌండ్స్, మహారాష్ట్ర సి–60 బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ప్రధాన స్థావరాన్ని చుట్టుముట్టాయి. మావోయిస్టు కీలక కమాండర్లు హిడ్మా, దామోదర్, దేవా, వికాస్‌లతో పాటు వందలాది మంది మావోయిస్టులు ఈ దిగ్బంధంలో చిక్కుకున్నారని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. మావోయిస్టులకు 'లొంగిపోవడం లేదా మరణించడం' తప్ప మరో మార్గం లేని పరిస్థితి ఏర్పడిందని బలగాలు పేర్కొన్నాయి. గత 72 గంటలుగా భద్రతా బలగాలు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ముందుకు సాగుతున్నాయి. మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు, స్నైపర్ల దాడులను తప్పించుకుంటూ కొండ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. మావోయిస్టుల ఆహారం, నీటి సరఫరా మార్గాలను బలగాలు పూర్తిగా నియంత్రణలోకి తీసుకున్నాయని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. ఇప్పటికే జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మరణించినట్లు తెలుస్తోంది. ఆకాశంలో హెలికాప్టర్లు, డ్రోన్లు నిఘా ఉంచగా, భూమిపై బలగాలు ముందుకు సాగుతున్నాయి. కర్రెగట్ట కొండలను వందలాది ఐఈడీలతో నింపేశామని, గ్రామస్థులు అటువైపు రావొద్దని మావోయిస్టు శాంత పేరుతో ఓ లేఖ విడుదలైంది. అయినా బలగాలు వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ, ఏడీజీ వివేకానంద సిన్హా, సీఆర్పీఎఫ్ ఐజీ రాకేష్ అగర్వాల్, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఈ ఆపరేషన్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. గత రెండేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు 300 మందికి పైగా మావోయిస్టులను మట్టుబెట్టాయి. కేవలం 2024లో 163 మంది, 2025 మొదటి మూడు నెలల్లోనే 142 మంది మావోయిస్టులు వివిధ ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ తీవ్రస్థాయి ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి.

## పీవోకేను భారత్‌లో కలపాలి

పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతతో పోల్చారని తెలిపారు. మనం మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలని, పీవోకేను భారత్‌లో కలపాలని అన్నారు. ఇందిరాగాంధీని గుర్తు చేసుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలని అన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న మనదేశంపై ఉగ్రదాడి జరిగిందని, ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు."140 కోట్ల మంది భారతీయులు రాజకీయాలకు, పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా అందరం ఒక్కటై తీవ్రవాదంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, అందరినీ ఆహ్వానించింది. భారత ప్రభుత్వానికి అండగా నిలబడాలని, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యకు మద్దతుగా నిలబడాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది భావోద్వేగ సందర్భం. ఇలాంటి సమయంలో మనమంతా ఏకమై భారత సార్వభౌమాధికారాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలబడాల్సిన సందర్భం ఇది. మన దేశం మీద జరిగే దాడులను తిప్పికొట్టేందుకు, కుట్రలు పన్నిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండాలి. ఆ కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలి" అని అన్నారు.

## తట్టాబుట్టా సర్దేయండి.. లేదంటే కఠిన చర్యలు

ఆ తర్వాత ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండటానికి అనుమతించబోమని డీజీపీ కఠినంగా హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా తెలంగాణలో ఉండాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని డీజీపీ స్పష్టం చేశారు. అలాంటి వారిని జల్లెడ పట్టి బయటకు తీసుకొస్తామని వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ తీవ్రంగా హెచ్చరించారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన వారు తమ దేశానికి తిరిగి వెళ్లడానికి అటారి–వాఘా సరిహద్దు ఈ నెల 30వ తేదీ వరకు తెరిచి ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 208 మంది పాకిస్తానీయులు ఉన్నారని, వారిపై నిఘా ఉంచామని డీజీపీ జితేందర్ రెడ్డి వెల్లడించారు.

కాగా అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాకిస్థాన్ జాతీయులను గుర్తించి, వారిని వెంటనే వెనక్కి పంపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అమిత్ షా ఆదేశించారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయుల పూర్తి సమాచారాన్ని సేకరించి కేంద్రానికి పంపాలని కోరారు. ఆ సమాచారం ఆధారంగానే వారి వీసాల రద్దు ప్రక్రియ జరుగుతుందని కేంద్రం స్పష్టం చేసింది. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాకిస్థానీయులకు భారత్‌లో పర్యటించే అవకాశం లభించింది. అయితే, తాజా పరిణామాల నేపథ్యంలో ఈ పథకం కింద ప్రస్తుతం భారత్‌లో ఉన్న వారందరూ 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ డీజీపీ జారీ చేసిన ఈ కఠినమైన ఆదేశాలు రాష్ట్రంలోని పాకిస్థాన్ జాతీయుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్ణీత గడువులోగా వారంతా తమ దేశాలకు తిరిగి వెళ్తారా లేదా అనేది వేచి చూడాలి. పోలీసులు ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది.

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటిన ఎంఐఎం

ఊహించని రీతిలో అభ్యర్థిని రంగంలోకి దింపడం ద్వారా ఈ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఈ నెల 23న జరిగిన ఎన్నికల్లో 78.57 శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. 66 మంది కార్పొరేటర్లు, 22 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలింగ్‌లో బీజేపీ , కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియె సభ్యులు పాల్గొన్నారు. ఓటింగ్‌కు బీఆర్ఎస్ కార్పొరేటర్లు దూరంగా ఉన్నారు. తొలి నుంచి గెలుపుపై ఎంఐఎం ధీమాగా ఉంది. మరోవైపు క్రాస్ ఓటింగ్‌పై బీజేపీ ఆశలు పెట్టుకుంది. తొలి నుంచి ఈ ఎన్నిక పైన మూడు పార్టీల మధ్య రాజకీయంగా చర్చ జరిగింది. ఈ నియోజకవర్గం లో ఎంఐఎం కు అత్యధిక ఓట్లు ఉన్నాయి. దీంతో ఎంఐఎం గెలుపు ఖాయమని అందరూ భావించారు. బీజేపీ అనూహ్యంగా బరిలోకి దిగింది. రెండు పార్టీలు తమ ఓటర్లతో చివరి వరకు భేటీలు నిర్వహించారు. ఫలితం ఎలా ఉన్నా కాంగ్రెస్, బీఆర్ఎస్ తరహాలో తాము పోటీకి దూరంగా ఉండమని బీజేపీ నేతలు తేల్చి చెప్పారు. తమ ఓట్లతో పాటుగా క్రాస్ ఓటింగ్ జరుగుతుందని బీజేపీ భావించింది. అయితే, అనూహ్యంగా బీజేపీ అంచనాలు తప్పాయి. ఊహించిన విధంగానే ఎంఐఎం అభ్యర్థి విజయం సాధించారు.

## ఉగ్రవాదులు వేరు ముస్లిం సమాజం వేరు

అన్నారు. కొంతమంది ఉగ్రవాదుల చర్యల వలన మొత్తం ముస్లిం సమాజాన్ని నిందించడం సరైంది కాదని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నమ్ముతోందని పవన్ కళ్యాణ్ వివరించారు. మరోవైపు జమ్ము కశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడిలో 26 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. వీరిలో తెలుగు వారు కూడా ఉన్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదనరావు ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. గురువారం కావలి వెళ్లిన పవన్ కళ్యాణ్ మధుసూదన్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. పహల్గాం ఉగ్ర దాడిని దేశం ఎప్పటికీ మరిచిపోదని ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిందేనని అన్నారు. భారతదేశానికి అతి మంచితనం, కనికరం ఎక్కువయ్యాయంటూ పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. అనంతరం విశాఖ చేరుకున్న పవన్ కళ్యాణ్ ఉగ్ర దాడిలో చనిపోయిన చంద్రమౌళి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమన్న పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం సమష్టిగా పని చేస్తుంది ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు పిఠాపురం నియోజకవర్గంలో 9 నెలల్లోనే రూ. 100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. పిఠాపురం ప్రజల రక్షణ తమ బాధ్యత అని శాంతిభద్రతల విషయంలో రాజీ పడేదే లేదని స్పష్టం చేశారు. పిఠాపురంలో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణానికి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. పిఠాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 30 పడకలతో ఉంది. ఈ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నిర్మాణ పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పిఠాపురం ఇంఛార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా పాల్గొన్నారు. అలాగే టీటీడీ కళ్యాణ మంటపం నిర్మాణానికి కూడా పవన్ శంకుస్థాపన చేశారు

## మోదీ సర్కార్ ఏం చేసినా మా మద్దతు

ఇచ్చే ప్రయత్నం చేశారు. "సమాజాన్ని విభజించడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని. ఈ ఉగ్రచర్యను జమ్మూ కశ్మీర్ మొత్తం ఖండించింది. వీరికి యావద్దేశం పూర్తి మద్దతుగా నిలిచింది. భారతీయులంతా ఐక్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. అప్పుడే ఉగ్ర చర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలం. కశ్మీర్‌తోపాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరం. మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి.

లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితోనూ భేటీ అయ్యా. ఏం జరిగిందో వారు వివరించారు. మా పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీ ఇచ్చా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా భేటీ అయ్యారు. సరిహద్దులో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఆయనకు వివరించినట్లు సమాచారం. శ్రీనగర్, ఉదంపూర్‌లో పర్యటించిన ఆర్మీ చీఫ్, కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ సైన్యం తూట్లు పొడుస్తున్న వేళ ఈ వరుస సమీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఫాజుల్ నగర్‌లో కిడ్నీ వైద్య శిబిరం




వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్ నగర్ గ్రామపంచాయతీలో శుక్రవారం కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రజిత నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ డా. సాయి కాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రమ, నెఫ్రాలజిస్ట్ డా. కొండల్ రావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఏంజలీనా సందర్శించారు. శిబిరంలో రోగుల కిడ్నీ సంబంధిత ఆరోగ్య పరిస్థితులను సమీక్షించి, వారికి అవసరమైన సూచనలు చేశారు. అలాగే వారి నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీలు, సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ వేములవాడలో ముస్లింల నిరసన



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ వేములవాడ పట్టణంలోని ముస్లింలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. శుక్రవారం నమాజ్ అనంతరం పట్టణంలోని అన్ని మసీదుల వద్ద మృతులకు సంతాపం ప్రకటిస్తూ ఈ నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రం మాట్లాడుతూ, పహల్గాం పర్యాటక ప్రాంతానికి వెళ్లిన 27 మంది పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణలేకుండా తుపాకులతో దాడి చేసి హత్య చేయడం దారుణమని పేర్కొన్నారు. ఈ ఘటనను దేశ ప్రజలు కుల, మత భేదములు లేకుండా ఖండించాలని పిలుపునిచ్చారు. "ఇది ఓ పిరికిపందల చర్య. ఇలాంటి దాడులను తిప్పికొట్టేందుకు దేశం ఐక్యంగా నిలవాలి. కేంద్ర ప్రభుత్వం నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి," అని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జమ్ముకాశ్మీర్‌లో భద్రతను మరింత బలోపేతం చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ కార్యదర్శి షాహిద్ పాషా, కోశాధికారి ముషాహిద్, మసీదు అధ్యక్షులు, మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కర్రెగుట్ట...

**ఖమ్మం :** : కర్రెగుట్ట చుట్టూ యుద్ధవాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ పేరుతో 20 వేల మంది భద్రతా బలగాలు తెలంగాణ?ఛత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టను చుట్టుముట్టాయి. అదే సమయంలో హెలిక్యాప్టర్ ద్వారా ఆపరేషన్ కూడా నడుస్తోంది. మూడు రోజులుగా ఈ ఆపరేషన్ నడుస్తోంది. కర్రె గుట్టపై దాదాపు వెయ్యి మంది మావోయిస్టులు డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సీఆర్పీఎఫ్ అనుమానిస్తోంది. కర్రెగుట్టపై ది మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత హిడ్మా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటి వరకు దండకారణ్యంలోని అబూజ్ మడ్ ప్రాంతాన్ని దాదాపుగా స్వాధీనం చేసుకున్నాయి కేంద్రబలగాలు. అబూజ్ మడ్ కు ఆనుకొని కర్రెగుట్ట మొదలవుతుంది.కర్రెగుట్టకు సంబంధించి.. బీజాపూర్ జిల్లాలోని ఊసూరు బ్లాక్, ఆవు పల్లి, పూజారి కాంకేడ్ ప్రాంతాలు ఛత్తీస్ గఢ్?లో ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉన్నాయి. కర్రె గుట్టలపై తెలంగాణలో పాముదూరు, తడపల, జెల్ల, డోలి, చెలిమల, బండారు పల్లి, ముకునూరు గ్రామాలుండేవి. ఈ గ్రామాలను గతంలోనే ఖాళీ చేయించి వారికి వేరే ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. అయితే పెనుగోలు గ్రామస్తులు మాత్రం అక్కడే ఉన్నారు.ఆబూజ్ మడ్ పై కేంద్ర బలగాలు ఆపరేషన్ మొదలు పెట్టగానే మావోయిస్టులు సమీపంలోనే ఉన్న కర్రెగుట్టకు మారినట్టు తెలెస్తోంది. ఇక్కడ డెన్ లు ఏర్పాటు చేసుకొని ఆయుధాలను దాచినట్టు చెబుతున్నారు. ఇక్కడికి పోలీసులు, భద్రతా బలగాలు రాకుండా గుట్ట చుట్టూ ల్యాండ్ మైన్స్ పెట్టినట్టు సమాచారం. పలువురు ఆదివాసీలు వేట కోసం కర్రెగుట్టకు వెళ్లి ఇటీవల మృత్యువాత కూడా పడ్డారు.మావోయిస్టులు కర్రెగుట్టపై డెన్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు స్పెషల్ ఆపరేషన్ కు శ్రీకారం చుట్టాయి. మూడు వైపుల నుంచి గుట్టను చుట్టుముట్టాయి. దీంతో పాటు హెలిక్యాప్టర్లు, డ్రోన్ల ద్వారా అణువణువూ తనిఖీ చేస్తున్నాయి. అబూజ్ మడ్ పరిధిలోని ఆదివాసీ గూడేలకు రోడ్లు వేసుకుంటూ ఆపరేషన్ మొదలు పెట్టిన సీఆర్పీఎఫ్ బలగాలు ప్రస్తుతం కర్రెగుట్ట వద్దకు చేరుకున్నాయి. అయితే ఈ ఆపరేషన్ రాష్ట్ర పోలీసులకు సంబంధం లేకుండా జరుగుతోంది. అదే విధంగా ఫారెస్టు అధికారులు సైతం కర్రెగుట్ట వైపు రావద్దంటూ సీఆర్పీఎఫ్ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు స్థానిక పోలీసులు ఎంటర్ అయ్యే అవకాశం లేదు.మావోయిస్టులు కర్రెగుట్టను సేఫ్టీ ప్లేస్?గా భావిస్తున్నారు. ఇదొక గుట్టల సముదాయం.. ఒక గుట్ట దిగగానే కొంత మైదాన ప్రాంతం ఉంటుంది.. ఆ వెంటనే గుట్ట స్టార్ట్ అవుతుంది. గుట్టల కింద సహజ సిద్ధంగా ఉండే బంకర్లు, సొరంగ మార్గాలున్నాయి. ఒక్కో బంకర్ చాలా విశాలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సెలయేళ్లు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. మూడు కాలాలూ నీటి వసతి ఉంటుందని అంటున్నారు. అయితే అబూజ్‌మడ్‌ను సీఆర్పీఎఫ్ బలగాలు స్వాధీనం చేసుకున్న దరిమిలా.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్టీ ప్లేస్ గా భావించే భారీ మొత్తంలో ఆయుధాలను తీసుకొని ఇక్కడికి వచ్చి ఉంటారని తెలుస్తోంది. ఇక్కడే డెన్ ఏర్పాటు చేసి ఉంటారనే అనుమానాలున్నాయి.ఆపరేషన్ కగార్?లో భాగంగా కర్రెగుట్టపై బేస్ క్యాంప్ ఏర్పాటు చేసుకొనేందుకు సీఆర్పీఎఫ్, భద్రతా బలగాలు రెడీ అవుతున్నాయి. ఇక్కడ ఆయుధాలను భద్రపర్చిన మావోయిస్టులు తిరిగి వస్తే వారిని పట్టుకోవడమే ఈ బేస్ క్యాంప్ లక్ష్యమని అంటున్నారు. ఈ ఆపరేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనా మావోయిస్టుల ఏరివేతలో ఇది అతి పెద్ద ఆపరేషన్ గా చెబుతున్నారు.

## బాబోయ్ ఉచిత ఆర్‌టిసి ప్రయాణం పథకం వద్దు

**కొడిమ్యాల :** ఓ అవ్వా!ఎటుపోతున్న వే సంచులు బాగా పట్టుకుని పోతున్నావు అని అడిగింది లచ్చమ్మ నర్సమ్మను ఎటు లేదవ్వ గా జగిత్యాల లో ఉల్లిగడ్డలు, ఎల్లి పాయలు ఇక్కడికన్నా అగ్గో అత్తున్నాయట గాడికోయ్యి తీసుకొద్దామని పోతున్నా అని చెప్పింది నర్సవ్వ అయ్యో గట్లనా జర్ర ఆగరాదు నేనుకూడా అత్త సంచులు పట్టుకొని అన్నది లచ్చవ్వ ఇద్దరు కలసి బస్టాండ్ కాడి కెళ్ళి నిలవడి బస్ కోసం ఎదురు సూడంగానే వాళ్ళ ఇంటి దగ్గర ఉన్న ఎల్లవ్వ కనిపించింది. ఓ ఎల్లవ్వ నువ్వేటు పోతున్నావే బస్సు కాడికచ్చినవ్ అనంగానే ఎటులేదే మీరు మాట్లాడుకునేది ఇన్నానే నేను గూడ ఉల్లి గడ్డలు కొంకుందామని అచ్చిన అన్నది నీ బస్ ఇంకా అత్తలేదు గీ బస్సు ఎప్పుడు అత్తదో ఏమో అని అటు ఇటు సూడంగానే కట్టే పట్టుకుని అటు ఓ ముసలయ్య అచ్చిండు. అగొ గీ తాతమన రాములు తాత లెక్కనే ఉన్నాడు.ఓ రాములు తాతా ఏడికే పోతున్నావు గీ బస్సు దగ్గరికి అచ్చినవ్ అని అడగంగానే జగితలా పొయ్యత్త బిడ్డా!ఓ రెండు ధోతుల జోడలు కొంకచ్చు కుంటా అని అచ్చిన గాని మమ్మల్ని బస్సు యెడ ఎక్కనిత్తండ్లు మొత్తం ఆడోళ్ళ తోటే నిండి పాయె మేము ఎక్కి నంక నిలువడి నిలవడి సచ్చేంత పనవుతుంది అనగానే ఎల్లవ్వ ఇంకా నయ్యం నీ పని నయ్యముంది ఇప్పుడు, ఇప్పుడు మా ఆడోళ్ళను సూడంగానే బస్సు ఆపకుంటా బుర్రు మని పోతుండ్లు ఆర్టీసీ వాళ్లకు కూడ అర్థమయ్యింది వీళ్లంతా అట్టి పనులకు కూడ బస్సులల్ల తిరుగుతుండ్లని అందుకే గీ ఉచిత పథకం ఏది ఇచ్చిన ప్రజలను మెప్పించే విధంగా ఉండి ప్రజలకు కూడ బాధ్యత కల్పించే విధంగా ఉంటే బాగుంటుంది అని చెప్పు కుంటపోతుంది ఎల్లవ్వ అంతలోనే బస్సు హారన్ వినిపించింది. బస్సు వచ్చి ఆగగానే ఒకళ్ల మీద ఒకళ్ళు పడి బస్సు ఎక్కారు.

## అమరావతి రైతులు, మహిళలకు

# గొప్ప అవకాశం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ వచ్చే నెల 2వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఈ సందర్భంగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. అయితే ఈ సందర్భంగా అమరావతిలో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు కూటమి సర్కార్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇక ప్రధాని సభలో రాజధాని ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు.గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం 3 రాజధానుల ప్రకటన చేసిన తర్వాత.. అమరావతి ప్రాంత రైతులు, మహిళలు చేసిన అసమాన పోరాటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని.. 3 ఏళ్లకు పైగా నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై టీడీపీ–జనసేన–బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. దీంతో మళ్లీ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే గతంలో 2014లో అమరావతి ప్రారంభోత్సవానికి పునాది రాయి వేసిన ప్రధాని మోదీ.. ఇప్పుడు మరోసారి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకోనున్నారు.ఈ క్రమంలోనే అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మే 2వ తేదీన ప్రధాని మోదీ.. ఆంధ్రప్రదేశ్ రానున్నారు. అమరావతి రాజధాని, సీఆర్డీఏ పరిధిలో సుమారు రూ.లక్ష కోట్లతో చేపట్టే పనులకు నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. అదే సమయంలో భారీ సభను ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. అయితే సభస్థలి వద్ద మొత్తం 3 వేదికలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో అమరావతి ప్రాంత రైతులు, మహిళలకు గొప్ప అవకాశం కల్పించనున్నారు. 3 వేదికల్లో ఒకదానిపై 30 మంది అమరావతి రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను కూర్చునేందుకు అవకాశం కల్పించనున్నారు.5 లక్షల మంది రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏపీ సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇక ప్రధాని మోదీ.. హెలిప్యాడ్ దిగిన తర్వాత అక్కడి నుంచి సభాస్థలానికి చేరుకునే వరకు 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షో నిర్వహించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లను గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, సీఆర్డీఏ, పోలీస్ అధికారులతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. వాహనాలు, జనం రద్దీని నియంత్రించడం.. పార్కింగ్ సమస్యలను పరిష్కరించడంపై అధికారులకు నారాయణ సూచనలు చేశారు. మే 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతిలో పర్యటించిన సీఎం చంద్రబాబు వెంటనే రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తై పనులు కూడా ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం రాజధాని అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

## తిరుపతి స్టేషన్ రూ.850 కోట్లతో

# అభివృద్ధి పనులు

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే స్టేషన్‌లు కొత్త అందాలను అద్దుకుంటున్నాయి.. అమరావతికి కీలకంగా ఉన్న రైల్వే స్టేషన్‌లకు మహర్దశ వస్తోంది. అమరావతి సమీపంలోని మంగళగిరి రైల్వే స్టేషన్‌తో పాటుగా విజయవాడ రైల్వే స్టేషన్ కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూపురేఖలు మారబోతున్నాయి.. అత్యాధునిక సదుపాయాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం కింద విజయవాడ రైల్వే స్టేషన్ త్వరలో విమానాశ్రయంలా మారనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.850 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నారు. రైల్వే బోర్డు దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఆమోదించాల్సి ఉంది.. ఆమోదం రాగానే పనులు మొదలవుతాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.విజయవాడ రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కీలకమైనది.. ఇక్కడ ప్రతిరోజు లక్ష మంది ప్రయాణికులు, అదే పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య రెండు లక్షల వరకు ఉంటుంది. మొత్తం 10 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి.. ప్రతిరోజు 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఐదు ప్రవేశ ద్వారాలతో అరుదైన గుర్తింపు పొందింది. ప్రతి ఏటా ఏకంగా రూ.500 కోట్ల ఆదాయం వస్తుండటంతో గతేడాది బెజవాడ రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ 01 హోదా కూడా పొందిన సంగతి తెలిసిందే.ప్రస్తుతం స్టేషన్లో ఉన్న ప్రవేశ ద్వారాలు చిన్నగా ఉన్నాయి.. వాటిని వెడల్పు చేయనున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ఎక్కువ స్థలం కేటాయిస్తారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లు, భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ మొత్తం కొత్తగా కనిపించేలా మార్పులు చేస్తారు. లైటింగ్, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను విశాలంగా నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అలాగే ప్రయాణికుల కోసం మంచి విశ్రాంతి గదులు, ఏసీ, నాన్ ఏసీ గదులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. రిజర్వేషన్ కేంద్రాలు, వెయిటింగ్ హాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర షాపులు కూడా ఉంటాయి.విజయవాడ రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు పెంచుతున్నా ప్రయాణికుల రద్దీకి సరిపోవడం లేదు. విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫాంలు, లిఫ్టులు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, పార్కింగ్ స్థలం తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు అమరావతి రాజధాని కావడం వల్ల రాబోయే ఐదేళ్లలో విజయవాడ స్టేషన్‌కు రద్దీ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించారు.డీపీఆర్‌కు వీలైనంత త్వరగా కేంద్రం ఆమోద ముద్ర వేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు ప్రయత్నిస్తే అభివృద్ధి పనులు మొదలవుతాయంటున్నారు. అంతేకాదు అమృత్ పథకం కింద కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని రాయనపాడు, గుణదల, గుడివాడ, మచిలీపట్నం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. గుణదల పనులు దాదాపు పూర్తికాగా.. రాయనపాడు పనులు కూడా త్వరలో పూర్తవుతాయని చెబుతున్నారు అధికారులు.

## గూగుల్‌లో ట్రెండింగ్ టాపిక్‌గా

# పహల్గామ్

**హైదరాబాద్** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారతదేశంలో మాత్రమే కాదు, పాకిస్తాన్‌లో కూడా వాతావరణం వేడెక్కింది. మంగళవారం అంటే ఏప్రిల్ 22న జరిగిన ఈ దాడిపై ఒకవైపు భారతదేశంలో కోపం, ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరోవైపు పాకిస్తాన్ ఇంటర్నెట్ వినియోగదారులు కూడా ఈ ఘటన గురించి ఆరా తీస్తున్నారు జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు. భారత్ చేపట్ట చర్యల గురించి తెలుసుకుంటున్నారు. ఈ దాడి తరువాత పాకిస్తాన్‌లోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ చీ (గతంలో ట్విట్టర్) గూగుల్‌లో దీనికి రిలేటెడ్‌గా ఉండే కీవర్డ్స్ వేగంగా ట్రెండ్ అవుతున్నాయి. నివేదికల ప్రకారం, పాకిస్తాన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో 'పహల్గాం, పహల్గాం ఎటాక్, కాశ్మీర్, పుల్వామా, జమ్ము ' వంటి పదాల గురించి వెతుకుతున్నారు.ఈ ఉగ్రవాద ఘటన తరువాత భారతీయ సోషల్ మీడియాలో చఖజీప్త్రజీశ్రీణజీమెవతీతీనీతీతిబబింబిబిజీఞఎ, చఓనీటతి వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతుండగా, పాకిస్తాన్‌లో కూడా ఈ దాడిపై ప్రజల ఆసక్తి కనిపిస్తోంది. సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారులు ఈ దాడిపై వేర్వేరుగా స్పందిస్తున్నారు. ఈ దాడిపై పొరుగు దేశం పాకిస్తాన్ నుంచి ఒక అధికారిక ప్రకటన కూడా వచ్చింది. పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ దాడిలో పాకిస్తాన్‌కు ఎలాంటి సంబంధం లేదని ఖండించారు. అయితే, సోషల్ మీడియాలో పాకిస్తాన్ వినియోగదారుల ప్రతిస్పందన ద్వారా ఈ ఘటన అక్కడ కూడా కలకలం రేపిందని స్పష్టమవుతోందిఅదే సమయంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదాన్ని భారతదేశం సహించదని ఆయన అన్నారు. అంతేకాదు దానికి తగిన ప్రతిస్పందన ఇస్తుందని అన్నారు. అలాగే ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఢిల్లీలోని ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, 'ఈ దాడి అమానుషమైనది మాత్రమే కాదు, సిగ్గుచేటు ప్రయత్నం. దీనికి స్పందన కచ్చితంగా బలంగా ఉంటుంది. చేసిన వాళ్లనే కాకుండా దీని వెనుక ఉన్న వారిని కూడా బయటకు లాగుతాం' అని అన్నారు.గూగుల్‌లో ట్రెండ్ అవుతున్న కీవర్డ్లు భారతదేశం మాత్రమే కాదు, పాకిస్తాన్ ప్రజలు కూడా పహల్గాం దాడికి సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. సెర్చ్ ట్రెండ్స్ ద్వారా పాకిస్తాన్ పౌరులు భారత్–పాక్ సంబంధాలపై దీని ప్రభావాన్ని గురించి ఆందోళన చెందుతున్నారని వెల్లడైంది.

## యుద్ధం వస్తే..

# ఎవరి బలం ఎంత.. సైన్యం ఎంత

**న్యూఢిల్లీ :** భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది.మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకిస్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలియన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖోయ్–30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండగా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్–17, ఎఫ్–16, మిరాజ్) ఉన్నాయి.యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్‌మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్యలోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది.

ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సైళు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబర్ మిస్సైళ్లు ఉన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు.

నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప.. భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

## మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో

# మాధవరెడ్డి అరెస్ట్

**మదనపల్లె** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె రెడ్డీస్ కాలనీకి చెందిన వైసిపి నేత, రైస్ మిల్ మాధవ రెడ్డిని గురువారం రాత్రి తిరుపతి సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. సిఐడి డిఎస్పి కొండయ్య నాయుడు కథనం మేరకు.. గత ఏడాది జూలైలో జరిగిన ఫైళ్ళ దగ్ధం కేసులో ఏ టు ముద్దాయిగా ఉన్న మాధవరెడ్డి కండిషన్ బెయిలుపై బయట తిరుగుతూ ఉన్నాడు. ఈ కేసులో ఇప్పటికే సబ్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతం తేజ్ ను సీఐడి అధికారులు మూడు నెలల క్రితం అరెస్టు చేయగా ఈ రోజు మాధవరెడ్డిని సిఐడి అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు..

## కాల్పులు ప్రారంభించిన పాకిస్థాన్

సీజ్ ఫైర్ ఎత్తేయడంతో నియంత్రణ రేఖ వెంబడి భారత్పై పాకిస్థాన్ కాల్పులు ప్రారంభించింది. పాక్ సైనికులు కాల్పులు మొదలుపెట్టారని, వారికి సైన్యం సమర్థంగా బదులిస్తోందని భారత సైనిక వర్గాలు తెలిపాయి. కాల్పుల విరమణ అమల్లో లేని కారణంగా సరిహద్దు వెంబడి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగే అవకాశం ఉంది..

## పాక్కు వత్తాసు పలికిన

# అస్సాం ఎమ్మెల్యే అరెస్ట్..

### – దేశద్రోహం కేసు నమోదు



**గువహటీ** పహల్గాంలో ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అయితే, అస్సాంలోని మంకాచార్ నియోజకవర్గానికి చెందిన ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం.. పహల్గాం ఘటనలో పాకిస్థాన్ను సమర్థిస్తున్నట్లు ఆరోపణలున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సీరియస్ అయ్యారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేని అరెస్టు చేసి, దేశద్రోహం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## అక్బర్ నగర్‌లో ఎంపి వంశికృష్ణ పర్యటన

**పెద్దపల్లి** రామగుండం అక్బర్ నగర్ లో ఎన్టిపిసి బూడిద పైప్ లైన్ పగిలి ఇండ్లలోకి చేరి దెబ్బతిన్న ఇండ్లను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలనీ అయనను కాలనీ వాసులు కోరారు. ఎన్టిపిసి అధికారులను పైప్ లైన్ పగలడానికి గల కారణాలు ఎంపి తెలుసుకున్నారు.వంశీ మాట్లాడుతూ ఫ్లాయాస్ అనేది ఒక విషపూర్తిమైంది... అలాంటి విషయం లో ఎన్టిపిసి యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలి. ఈ యాష్ వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బూడిదతో నిండిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఓదార్చారు. పైప్ లైన్ ప్రమాదంపై ఎన్టిపిసి అధికారులతో చర్చించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.రామగుండం ప్రజల రక్షణే ఎన్టీపీసీ ప్రథమ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

## తాడేపల్లిగూడెం నిట్ సమీపంలో

# రోడ్డు ప్రమాదం

### – ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు

**తాడేపల్లిగూడెం** నిట్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరోకరికి తీవ్ర గాయాల్యాయి. ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్నారు.

కరణం వెంకటేశ్వరరావు (30) సంఘటన స్థలంలోని మృతిచెందగా, నవీన్ అనే యువకుడు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయలైన నవీన్ కి చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.వెంకటేశ్వరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు.

# కేటీ రామారావుకు ఫుల్ పవర్స్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఎన్నికల్లో ఆయనే అంతా డిసైడ్ చేసేటట్లున్నారు. కేసీఆర్ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గౌరవం ఆయనకు ఉంటుంది. ఆయన సలహాలు, సూచనలు మాత్రమే తీసుకుంటారు. కేసీఆర్ చెప్పే వ్యూహాలను రాజకీయంగా అమలు చేయనున్నారు. అంతే తప్ప నియోజకవర్గాల్లో కేసీఆర్ జోక్యం మాత్రం ఇక ఉండకపోవచ్చని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ రాజకీయంగా యాక్టివ్ గా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు గులాబీపార్టీలో జోరుగా ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో కేటీఆర్ ను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు కూడా క్యూ కడుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు అంటే రానున్న ఏడాది తాను తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ వచ్చే ఏడాది పాదయాత్ర చేసిన తర్వాత కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇప్పటికే అక్టోబరు నెలలో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని కూడా కేటీఆర్ ప్రకటించారు. ఇక తాజాగా కేటీఆర్ రాజేంద్ర నగర్ ఉప ఎన్నికల్లో పటోళ్ల కార్తీక్ రెడ్డి పేరును ప్రకటించడం కూడా ఈ చర్చకు కారణమయింది. ఏ మాత్రం కేసీఆర్ తో సంబంధం లేకుండా ముందుగానే, ఉప ఎన్నికల ఊసే లేకముందే అభ్యర్థిని ప్రకటించడంతో ఇంకా కారు స్టీరింగ్ కేటీఆర్ చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టమయింది. కేసీఆర్ కూడా తొలి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పెద్దగా ఆయన రాష్ట్రం కోసం పనిచేయాలన్న ఆకాంక్ష కూడా లేదు. దీంతో పాటు ఎక్కువ కాలం ఫామ్ హౌస్ లోనే పరిమితమవుతున్నారు. వ్యవసాయంలోనే ఆయన ఎక్కువ గడుపుతూ చాలా వరకూ సేద తీరుతున్నారు. వ్యవసాయ క్షేత్రం అంటే ఆయనకు మక్కువ. రాజకీయంలో అంచులన్నీచూశారు. పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ కు మిగిలిన రాజకీయ నేతలకు మాదిరిగా పెద్ద లక్ష్యాలు ఏవీ ఉండవు. కానీ తాను స్థాపించిన పార్టీని మరొకసారి అధికారంలోకి తీసుకు వస్తే చాలునన్న భావనలో ఉన్నారు. అందుకే ఈసారి ఎన్నికలలో కేటీఆర్ క్రియాశీలకంగా మారనున్నారు. టిక్కెట్లను కూడా ఆయనే కేటాయించనున్నారు.

## మంత్రి వర్గం వాయిదాల పర్వంతోనే సరి..

**హైదరాబాద్ :** ఇదిగో.. అదిగో.. అన్నారు. కొందరైతే డేట్ కూడా ఫిక్స్ చేశారు. తీరా చూస్తే ఏదీ లేదు. వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడనేది.. అసలు అంతుచిక్కని ప్రశ్నగా మారిపోయింది. అయితే ఇప్పుడు మీనాక్షి నటరాజన్ కామెంట్స్‌తో మరోసారి కేబినెట్ అంశం తెరపైకొచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఎవరి పరిధిలో ఉంటుందన్న టాపిక్‌పై తెలంగాణలో హాట్‌హాట్ డిబేట్స్ నడుస్తున్నాయిమంత్రివర్గ విస్తరణ కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూపులు.. అంతకంతకూ పెరిగిపోయిన ఆశావహులు.. కాలం గడిచిపోతున్నా పదవీ కాంక్ష నెరవేరని నాయకుల ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పట్లో కేబినెట్ విస్తరణ కష్టమేనన్న సంకేతాలతో కొన్నాళ్లుగా నేతలంతా సైలెంట్ అయిపోయారు. అయితే లేటెస్ట్‌గా మంత్రివర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త చర్చకు తెరలేపాయి. కేబినెట్ విస్తరణ అంశం ముఖ్యమంత్రి పరిధిలో ఉందంటూ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.ఈ కామెంట్సే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మొన్నటిదాకా కేబినెట్ విస్తరణ అంశం కాంగ్రెస్ హైకమాండ్ చేతిలో ఉంటుందని చెబుతూ వచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులనే మంత్రిపదవి వరిస్తుందని.. ఆ నేతలు ఎవరనేది మాత్రం నిర్ణయించేది అధిష్టానమే పదేపదే చెప్పారు రేవంత్‌రెడ్డి. దీంతో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవుల కోసం ఎంతోమంది సీనియర్లు అధిష్టానం పెద్దలను కలవడం, లేఖలు రాయడం జరిగింది.సీనియర్ నేత జానారెడ్డి కూడా హైకమాండ్‌కు లెటర్ రాశారు. రంగారెడ్డి జిల్లాకు ఛాన్సివ్వాలని ఖర్గేకు, కేసీ వేణుగోపాల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయితే ఓ అడుగు ముందుకేసి.. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే రాజీనామా చేస్తానంటూ పార్టీ పెద్దలకే అల్టిమేటం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారన్న ప్రచారం జరిగింది. ఇటు నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ జరిపినట్లు జోరుగా ప్రచారం నడిచింది. ఇలా ఒక్కరేంటి? మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్న తపనతో ఎందరో నేతలు హస్తినబాట పట్టారు.మరికొందరు విజ్ఞప్తి లేఖలు ఢిల్లీకి పంపారు.మొత్తంగా? కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ ఒకలా.. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మరోలా మాట్లాడటంతో నేతలంతా కన్‌ఫ్యూజన్‌లో పడ్డట్లు తెలుస్తోంది. మరీ ఈ కేబినెట్ విస్తరణ కన్‌ఫ్యూజన్‌పై క్లారిటీ రావాలంటే కాస్త ఆగాల్సిందే..!

## వికలాంగులకు ట్రై సెకిల్స్, వీల్ ఛైర్లు పంపిణీ చేసిన ఎంపి చిన్ని

**విజయవాడ** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారంతో వికలాంగులకు ట్రై సైకిల్స్, వీల్ చైర్స్ ఉచితంగా పంపిణీ జరిగింది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లకి చెందిన వికలాంగులకు ట్రై సైకిల్స్, వీల్ చైర్స్ అందజేసారు.లబ్దిదారులు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఫతావుల్లాహ్, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు సొలంకి రాజు, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, మాజీ మేయర్ తాడి శకుంతల, ఎన్టీఆర్ జిల్లా ఎమ్.ఎస్.ఎమ్.ఈ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మాదిగాని గురునాథం, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుఖాసి సరిత, పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మిభానుప్రకాష్, బిసి నాయకులు పట్నాల హరిబాబు, క్లస్టర్ ఇన్చర్జ్ ధనేకుల సుబ్బారావు ,లోకేష్, బిసి సెల్ రాష్ట్ర నాయకులు గుర్రం కొండ, డివిజన్ అధ్యక్షులు నాగోతి రామారావు, శివాజీ ముదిరాజు , ఈశ్వరరావు, నాయకులు శ్యామ్, బడేషా, ఆలీ తదితరులు పాల్గోన్నారు.

# వంశీ ఇంకెన్నాళ్లు...

**విజయవాడ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులు అవుతుంది. అయినా ఆయన ఇంకా జైలులోనే మగ్గుతున్నారు. కేసుల మీద కేసులు ఆయనపై వరస పెట్టి పెడుతున్నారు. అందుకోసమే బెజవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వల్లభనేని వంశీని టీడీపీ కార్యాలయంలో ఉన్న సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో వల్లభనేని వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న అరెస్ట్ చేశారు. అంటే నేటికి వల్లభనేని వంశీ అరెస్టయి దాదాపు డెబ్బయి రోజులవుతుంది. కొన్ని కేసుల్లో బెయిల్ వస్తున్నా మరికొన్ని కేసుల్లో మాత్రం బెయిల్ లభించడం లేదు. అందుకే ఆయన విజయవాడ జిల్లా జైలులోనే మగ్గిపోతున్నారు.. గన్నవరం పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు కేసుల్లో పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వారెంట్లపై నేడు విచారణ చేపట్టనున్న న్యాయస్థానం నిర్ణయాన్ని వెలువరించనుంది. కేవలం సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులతో పాటు గన్నవరం నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్స్ అక్రమ తవ్వకాలపై కూడా కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. వీటికి తోడు భూ కబ్జాల ఆరోపణలపై కూడా వంశీపై అనేక కేసులు నమోదు కావడంతో ఒక దాంట్లో బెయిల్ వస్తే మరొక కేసు మెడకు చుట్టుకుంటుంది. ఫిబ్రవరి 13న... వైసీపీ అధికారంలో ఉండగా వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరుపై ఆగ్రహంగా ఉన్న కూటమి ప్రభుత్వం వల్లభనేని వంశీని అరెస్ట్ చేస్తుందని ముందే తెలిసినప్పటికీ ఇలా వరస కేసులు వచ్చిపడతాయని ఊహించలేదు. సోషల్ మీడియాలో టీడీపీ క్యాడర్ ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో ఇక ఫిబ్రవరి 13న పకడ్బందీగా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గన్నవరం నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అక్కడే మకాం వేశారు. అయితే పోలీసులు మాత్రం అన్నికోణాల్లో ఆలోచించి వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పట్లో వల్లభనేని వంశీ బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. తాను వేసిన సింగిల్ బ్యారక్ కాదని, అందరిలోనూ కలిపి ఉంచాలని, బయట నుంచి ఆహారాన్ని తెప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని వల్లభనేని వంశీ గతంలో న్యాయస్థానాన్నిఆశ్రయించారు. అదే సమయంలో మిగిలిన ఖైదీలతో పాటు తనను ఉంచాలని కూడా కోరారు.

తనకు ప్రాణభయం ఉందని కూడా వల్లభనేని వంశీ చెప్పారు. అయితే వరసగా కేసులు నమోదవుతుండటం, ఒక కేసులో బెయిల్ వచ్చినా మరొక కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు అన్నీ సిద్ధం చేస్తున్నారు. అందుకే వల్లభనేని వంశీ ఇప్పట్లో బయటకు వచ్చేందుకు ఛాన్స్ లేదు. ఇంకా బెజవాడలోని మండుటెండలకు మరికొద్ది కాలం జైలులోనే ఉండి పోవాల్సి పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

## కేడర్‌లోనూ నిరుత్సాహం

గత ఏడాది జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలైన వైసీపీని చాలా మంది వదిలేశారు. కీలక రెడ్డి నాయకుల నుంచి అనేక మంది బీసీల వరకు.. కూడా పార్టీకి దూరమయ్యారు. ఈ క్రమంలో ఇప్పుడు కీలకమైన కార్యకర్తల వంతు వచ్చింది. ఏ పార్టీకైనా.. నాయకులతోపాటు.. కార్యకర్తలు చాలా కీలకం. నాయకులు జంప్ చేస్తారు..కానీ.. కార్యకర్తలు మాత్రం ఎంతో కొంత అంకిత భావంతో పార్టీలను అంటిపెట్టుకుని ఉంటారు. ఎన్నికల సమయంలోనూ..వారే కీలకం.ఈ విషయాన్ని గుర్తించే.. దాదాపు అన్ని పార్టీలూ..కార్యకర్తలే తమకు బలమని.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతాయి. కార్యకర్తల సెంట్రిక్‌గా అనేక కార్యక్రమాలు కూడా చేపడతాయి. అయితే.. వైసీపీ విషయానికి వస్తే.. కార్యకర్తలనను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో వలంటీర్లే సర్వస్వంగా అప్పట్లో సీఎం జగన్ వ్యవహరించారు.
ఇది పార్టీకి మేలు చేయకపోగా.. ఓడించేసింది. తద్వారా.. పార్టీ నామరూపాలు లేకుండా పోయిందన్న చర్చ ఉంది.ఇంత పరాభవం తర్వాత.. ఒకటి రెండు సార్లు.. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నానని జగన్ చెప్పుకొచ్చా రు. కానీ.. నెలలు గడిచిపోతున్నా.. ఆయన కార్యకర్తల విషయంలో ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవడం లేదు. గుర్తింపు అంతకన్నా లేదు. పైగా.. టీడీపీ సహా కూటమి నాయకులు.. కార్యకర్తలపై పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నారు. ఇదే జరిగితే.. జైలుకు వెళ్తోంది. కార్యకర్తలు, నాయకులే. కనీసం వారిని పరామర్శించడంలోనూ.. న్యాయపరంగా రక్షణ కల్పించడంలోనూ..వైసీపీ అధినేత విఫలమవుతున్నారు.ఆయా విషయాలను గమనిస్తున్న వైసీపీ కార్యకర్తలు.. ఇప్పుడు ప్లేట్ మార్చేస్తున్నారు. టీడీపీ కానీ.. జనసేన కానీ..కార్యకర్తలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. సీఎం చంద్రబాబు సైతం..తన ప్రొటోకాల్ ను పక్కన పెట్టి మరీ.. కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి కష్టాల్లో ఉంటున్నవారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. భరోసా కల్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వవైసీపీలో అలజడి రరేగింది. ఇంకా పార్టీని నమ్ముకుని ఇక్కడే ఉంటే కష్టమనిభావిస్తున్న వారు.. జెండా మార్చేసేందుకు రెడీ అయ్యారు. గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక మంది కార్యకర్తలు.. గత రెండు రోజుల్లోనే టీడీపీ, జనసేనల బాటపట్టడం గమనార్హం

# క్రియాశీలక రాజకీయాల్లోకి భువనమ్మ..

**నెల్లూరు :** ప్రజా నాయకుడు.. లేదా నాయకురాలు.. కావడానికి జెండా పట్టుకునే తిరగాల్సిన అవసరం లేదని.. ఈ దేశంలో అనేక మంది నిరూపించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తూ.. ప్రజల మనసుల్లో చోటు దక్కించుకున్నవారు ఎందరో ఉన్నారు. అంత మాత్రాన వారు రాజకీయా ల్లో పాల్గొని పోటీ చేయాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి వారిలో నర్మదాబచావో(నర్మదా నదిని రక్షించండి) పేరుతో ఉద్యమించిన మేధా పాట్కర్ వంటివారు ఉన్నారు.ఇప్పుడు అలానే అప్రకటిత ప్రజానేతగా.. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వర నిలుస్తున్నారు. ఆమె.. ప్రజలకు చేరువ కావడం.. వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నారా వారి సొంత నియోజకవర్గం కుప్పంలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. నెలకు మూడు నుంచి నాలుగురోజుల పాటు అక్కడే ఉంటున్నారు. ఇక్కడ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. సాయం చేస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నారు.అంతేకాదు.. ఒక్కకుప్పమే అయితే.. భువనేశ్వరి గురించి.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఖమ్మం వరకు కూడా.. ఆమె తన ప్రజా ప్రస్థానాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కృష్ణాజి ల్లాలోని తన తండ్రి గ్రామం నిమ్మకూరులో పెద్ద ఎత్తున పాఠశాలను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి స్కాలర్ షిప్పులు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్టును మరింత బలోపే తం చేసి.. పేదలకు, సమాజంలో అణగారిన వర్గాలకు ఆసరా చూపిస్తున్నారు.ఇదంతా స్వచ్ఛంద సేవే కదా.. ప్రజానేత ఎలా అవుతారన్న ప్రశ్నలు సహజం. అయితే.. కేవలం స్వచ్ఛం ద సేవకు మాత్రమే భువనేశ్వరి పరిమితం కాలేదు. అవసరానికి తగిన విధంగా రాజకీయ అవతారం కూడా ఎత్తుతున్నారు. గత ఎన్నికల్లో ఊరూ వాడా ప్రచారం చేశారు. ఇప్పుడు కూడా.. పీ4 పథకంపై ఆమె అంతర్గతంగా పారిశ్రామిక వేత్తలతో చర్చిస్తున్నారు. వీరిలో మహిళా పారిశ్రామికవేత్తలను ఒప్పించే పనిలో ఉన్నారు. తద్వారా.. చంద్రబాబు ఆశయాలకు దన్నుగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు. సో.. భువనేశ్వరి రాజకీయ నేత కాకపోవచ్చు.. కానీ, అప్రకటిత ప్రజానేతగా మాత్రం గుర్తింపు పొందుతున్నారనడంలో సందేహం లేదు. ఇటీవల కుప్పం డిగ్రీ కాలేజీలో భువనేశ్వరి ముఖాముఖిలో పాల్గొన్నారు. డ్రగ్స్, గంజాయి యువతను నాశనం చేస్తోందన్నారు. "వారి స్వలాభం కోసం చాలా మంది మిమ్మల్ని టెంప్ట్ చేస్తారు. చాలా జాగ్రత్తగా ఉండాలి. రోల్ మోడల్ పెట్టుకోవాలి" అని విద్యార్థులకు సూచించారు. ప్రతి పురుషుని సక్సెస్ మహిళతోనే ముడి పడి ఉంటుందన్నారు. "కాలేజ్ డేస్ గుర్తుకు వస్తున్నాయి. ఆషామాషీగా వెళ్లి మీరందరూ చేసేదే నేను కూడా కాలేజ్‌లో చేసేదాన్ని. మిమ్మల్ని చూసి గర్వంగా ఉంది. ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అవర్ ఆంధ్రప్రదేశ్ లీడర్ ప్రతి ఒక్కరిలో ఉంటుంది. మీ హక్కుకోసం నడవాలి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీకోసం సంపాదిస్తున్నారు. అది ఈజీ కాదు. హార్డ్ వర్క్. ఏదీ ఫ్రీగా రాదు. కష్టంతోనే వస్తుంది. బాలికలకు పట్టుదల, ధైర్యం, మీమీద నమ్మకం ఉండాలి. పెళ్లి అయ్యేదాకా ఒకటి, తర్వాత మరొకటి. రాజకీయాల్లో బిజినెస్‌లో నన్ను నేను లాక్కుని ముందుకు వెళ్ళాను. మన ధైర్యం మనకుండాలి" అని వెల్లడించారు.ముందు నందమూరి కుమార్తెను.. బాబు భార్య సెకండ్. ఒక మహిళగా నేనేమిటి అనేది నాకు తెలుసు. మనందరిలోనూ ఆ శక్తి ఉంది. ఫోకస్ పనిలోపెడితే ముందుకు వెళ్ళచ్చు. హౌస్ వైఫ్ ఉన్నప్పుడు హెరిటేజ్ చూసుకోమన్నారు. నాకే ఏమీ తెలియదు. ఎండీగా బాధ్యతలు ఇచ్చారు. అందరినీ ఒకటే అనుకున్నాను. జీవితాలు బాగుంటాయి. హార్డ్ వర్క్ మీద నమ్మకం పెట్టాలి. నాన్నకంటే గొప్పవాడివి కావాలి. చేయకపోతే నీ ఫ్యూచర్ ఆగుతుంది అని నా కుమారునికి చెప్పా. మీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది.
ఎవరూ రారు. బద్ధకం ఉంటే జీవితంలో ఎదగలేరు. మీరే ఫ్యూచర్ లీడర్స్, ఏ రంగంలోనైనా. డిసిప్లిన్ ముఖ్యం. నాకు డిసిప్లిన్ ఎక్కువ. స్ట్రిక్ట్ నెస్ లేకపోతే నేను ముందుకు వెళ్లలేను. ఉద్యోగాలకు, ఆర్గనైజేషన్ టీమ్ వర్క్ ఉండాలి. అందరూ మనమే అంటేనే భవిష్యత్తు. సంతోషంగా కార్యక్రమం చేపట్టాలి. జీవితంలో టీచర్స్‌ను మరచిపోవద్దు. రెస్పెక్ట్ ఇవ్వాలి వారికి. అందరిలో ఉంటాయి తప్పులు. ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు మనల్ని చూపిస్తాయి. ఇవన్నీ ఎదుర్కొన్నాను నేను. వ్యాపారం, ఉద్యోగం అన్నింటిలోనూ ఆడపిల్ల దేనిలోనూ తక్కువకాదు. నా జీవితంలో చూస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ మిమ్మల్ని మీ కుటుంబం నుంచి దూరం చేస్తుంది. కుటుంబానికి ఇంపార్టెన్స్ ఇవ్వండి. ఫోన్లు, సోషల్ మీడియా కుటుంబాలకు దూరం అవుతున్నారు" అని తెలిపారు.

# బాలినేనికి చిక్కని పట్టు

**ఒంగోలు :** మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు. జిల్లాపై పట్టున్న నేతగా... బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు.

అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు.

బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక స్థానం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి.. నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాలినేని పని చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించారు.దీంతో బాలినేని సైతం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేసి నడిచారు. ఆయన ఒంగోలు ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచారు. ఇక 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి జగన్ కేబినెట్‌లో స్థానం సంపాదించారు.

రెండున్నరేళ్ల తర్వాత జగన్ కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో మంత్రి పదవిని బాలినేని కోల్పోయారు.అయితే వైఎస్ జగన్ కుటుంబంతో బాలినేనికి సమీప బంధుత్వం ఉంది. అయినా ఆయన్ని కేబినెట్ నుంచి తొలగించడంతో తీవ్ర మనో వేదనకు గురయ్యారనే గట్టి ప్రచారం అయితే జిల్లా గట్టిగానే సాగింది. అందువల్లే నాటి నుంచి పార్టీ అధిష్టానానికి ఆయన సాధ్యమైనంత దూరంగా ఉన్నారనే చర్చ సైతం సాగింది. ఇక ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారానికి దూరమైంది. ఎమ్మెల్యేగా సైతం బాలినేని ఓటమి పాలయ్యారుపార్టీ వీడేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ వద్ద కుండ బద్దలు కొట్టారు. బాలినేనికి నచ్చ జెప్పేందుకు పార్టీ అధినేతే కాదు.. అగ్రనేతలు సైతం ప్రయత్నించారు. కానీ బాలినేని మాత్రం వారి సూచనలు సలహాలు పట్టించుకోలేదు

# చంద్రబాబు మాస్టర్ ప్లాన్

**విజయవాడ :** మంద కృష్ణ మాదిగ. పరిచయం అక్కర్లేని పేరు ఇది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో ఆయన సుపరిచితం. జాతీయ స్థాయిలో సైతం తనదైన ముద్ర చాటుకున్నారు. ఎక్కడో ప్రకాశం జిల్లాలో 14 మంది యువకులతో మాదిగ దండోరాను ఆయన ప్రారంభించారు. ప్రతి మాదిగ గూడెంలో దండోరా జండా ఎగిరే విధంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని విస్తరించారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను కొన్ని వర్గాలకే దక్కాయని.. అందరికీ విస్తరింపజేయాలన్న ధ్యేయంతో ఆయన చేపట్టిన ఉద్యమం జాతీయ స్థాయిలో సైతం కలిగితురాయిగా నిలిచింది.

అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం ఎస్సీ వర్గీకరణకు జై కొట్టింది. దీంతో జాతీయస్థాయిలో సైతం మందకృష్ణ మాదిగ పేరు మార్మోగింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగను రాజకీయంగా ప్రోత్సహించాలని ఎన్డీఏ నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విజయసాయిరెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ ద్వారా తనకు లభించిన రాజ్యసభ పదవిని సైతం ఆయన వదులుకున్నారు. దీంతో ఏపీ నుంచి రాజ్యసభ పదవి ఖాళీ అయింది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ తరుణంలో రకరకాల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ సీటు బిజెపికి విడిచి పెట్టాలని ఆ పార్టీ పెద్దలు కోరినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఢిల్లీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీని సైతం ఏపీ నుంచి రాజ్యసభకు పంపిస్తారని టాక్ నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగ పేరు తెరపైకి వచ్చింది. దీని వెనుక చంద్రబాబు వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది.ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. మెజారిటీ ఎస్సీ ఉప కులాల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు ఆదరణ పెరిగింది. ప్రధానంగా మాదిగ, రెల్లి ఉప కులాల నుంచి విశేష స్పందన వస్తోంది. వాస్తవానికి ఎస్సీ సామాజిక వర్గం ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మద్దతు దారుగా ఉంది. కానీ 2024 ఎన్నికల్లో ఎస్సీల్లో స్పష్టమైన చీలిక కనిపించింది. దానిని అలాగే ఉంచుకోవాలంటే ఎస్సీ వర్గీకరణ అనేది చేయాలని చంద్రబాబు ప్లాన్. అందుకే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన మరుక్షణం.. ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

ఆ కమిటీ నివేదిక ఇచ్చిందో లేదో అమలు చేసి చూపించారు. అదే సమయంలో ఆది నుంచి ఎస్సీ వర్గీకరణ విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్న చంద్రబాబుకు మందకృష్ణ మాదిగ అనేక సందర్భాల్లో మద్దతు తెలిపారు. అదే సమయంలో మొన్నటి ఎన్నికల్లో తెలంగాణలో సైతం బిజెపికి మద్దతు ప్రకటించారు. రెండు చోట్ల ఎన్డీఏ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేశారు. అందుకే ఇప్పుడు మందకృష్ణ మాదిగ పేరును తెరపైకి తెచ్చి.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీఏ లబ్ధి పొందేలా ప్లాన్ చేస్తున్నారు చంద్రబాబు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలోఅధికారంలోకి రావాలన్నది బిజెపి ప్లాన్. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగానే బీసీ నేత కృష్ణయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చింది. ఇప్పుడు మందకృష్ణ మాదిగ కు ఇస్తే.. బీసీలతో పాటు మాదిగ సామాజిక వర్గం బిజెపి వైపు వస్తుందన్నది ప్లాన్. ఇదే విషయాన్ని బిజెపి అగ్ర నేతలకు చంద్రబాబు వివరించినట్లు తెలుస్తోంది. మంద కృష్ణ మాదిగకు రాజ్యసభ పదవి ఇస్తే తెలంగాణతో పాటు ఏపీలో రాజకీయంగా లబ్ధి పొందవచ్చని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మొత్తానికైతే అనూహ్యంగా పెద్దల సభలో మందకృష్ణ మాదిగ అడుగుపెట్టడం ఖాయమని తెలుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# జాతీయ ప్రాజెక్టుగా రాజధాని..?

**విజయవాడ :** నవ్యాంధ్ర రాజధాని అమరావతిని.. ఇప్పటి వరకు ఊహిస్తున్న దానికి భిన్నంగా.. మరింత డెవలప్ చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ప్రయత్నాలుచేస్తోంది. దీనిలో భాగంగా.. రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారులతో రాజదానిని అనుసంధానించే ప్రక్రియకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఇది పూర్తయితే.. అమరావతి.. అందరిదీ అనే భావనను మరింత పెంచి.. దీనిని పొరుగు రాష్ట్రాలకు కూడా చేరువ చేయనున్నారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేవారిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయం అమరావతిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించి మరో 30-40 వేల ఎకరాల భూమిని సేకరించే దిశగా అడుగులు వేసింది. ఇది పూర్తయ్యేందుకు రెండేళ్ళ గరిష్ఠ సమయాన్ని నిర్దేశించుకుంది. ఇక, ఈ క్రమంలోనే రహదారుల విస్తరణకు కూడా.. కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా.. చెన్నై-కోల్‌కతా-హైదరాబాద్‌లతో రాజధానిని అనుసంధానించే జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. 2015-19 మధ్య దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించినా.. వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. కానీ.. ఇప్పుడు దీనిని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. తద్వారా.. రాజధానిని దేశవ్యాప్తంగా.. అన్ని ప్రాంతాలకు అనుసంధానించాలని నిర్ణయించింది. దీనిలో కీలకమైన మూడు రహదారులపై మాస్టర్ ప్లాన్‌రెడీ చేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్-5, ఎలివేటెడ్ కారిడార్-13, నేషనల్ హైవే ? 13లను నిర్మించి..వాటి ద్వారా హైదరాబాద్, చెన్నై, కోల్‌కత వంటి నగరాలకు అమరావతిని కలుపుతారు.. తద్వారా.. దేశవ్యాప్తంగా రహదారి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. పలువురుపెట్టుబడి దారులు.. కూడా..ఈ మార్గాలపై ఇటీవల సీఎం చంద్రబాబుతో చర్చించారు. దీంతో ఈ విషయంపై తాజాగా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.అదేసమయంలో కేంద్రానికి కూడా సమాచారం పంపించి.. ఆయారహదారుల నిర్మాణంపై క్లారిటీతీసుకుంటారు. దీంతో అమరావతి రాజధానిని జాతీయ ప్రాజెక్టుగా మరింత తీర్చిదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు.
పటేల్ తరహాలో అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలోని నీరుకొండపై 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ బేస్‌లో ఎన్టీఆర్ జీవితం, కళాకృతులు, మినీ థియేటర్ తదితరాలు ఉండనున్నాయి. డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు ఆహ్వానించారు. నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల కిందట మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించి వచ్చారు. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది. దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు. ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్ర తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

# ఏపీఎస్సీఎస్సీలో 18 నోటిఫికేషన్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీలో ఉద్యోగ నియామక ప్రక్రియలో వేగం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. మెగా డిఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదలైంది.ఎస్సీ వర్గీకరణ అంశం కొలిక్కి రావడంతో ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్న నోటి ఫికేషన్ల విడుదలకు ఏపీపీఎస్సీ సిద్ధమైంది. ఈ ఏడాది జనవరిలోనే నోటిఫికేషన్లు జారీ చేయాలని భావించినా ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చక పోవడంతో నోటిఫికేషన్లు ఆలస్యమయ్యాయి.ఏపీ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 866 పోస్టుల భర్తీకి సంబంధించి 18 నోటిఫికేషన్లు ఏపీపీఎస్సీలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అటవీ శాఖకు సంబంధించి 814 పోస్టులున్నాయి.ఎస్సీ వర్గీకరణకు తగ్గట్లు అన్ని శాఖల్లో రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ కసరత్తు పూర్తవగానే ఏపీపీఎస్సీ నోటి ఫికేషన్ల జారీ చేయాలని భావిస్తోంది.శాఖల వారీగా భర్తీ చేయనున్న ఉద్యోగాలుఅటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 100 ఉన్నాయి. వీటిలో 30 పోస్టులు క్యారీ పార్వర్డ్ పోస్టులుగా ఉ?నాయి.అటవీ శాఖలో బీట్ ఆఫీసర్ అండ్ అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు 691 ఉన్నాయి. వీటిలో 141 క్యారీ ఫార్వర్డ్ పోస్టులు ఉన్నాయి.
డ్రాఫ్ట్ మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్: పోస్టులు 13 ఉన్నాయి.వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు 10, దేవాదాయ శాఖలో ఈవో పోస్టులు 7, జిల్లా సైనిక సంక్షేమ అధికారుల పోస్టులు 7, ఇంటర్మీడియట్ విద్యలో లైబ్రేరియన్ పోస్టులు 2, ఉద్యానశాకలో హార్టికల్చర్ పోస్టులు 2, మత్స్య శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 2, భూగర్భ జలశాకలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు 2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ క్యాటగిరీ 2 పోస్టులు 2, మునిసిపల్ శాఖలో సీనియర్ అకౌంటెంట్ పోస్టులు 11, టైపిస్ట్ పోస్టులు 1, అసిస్టెంట్? మోటార్ వెహికల్ పోస్టులు 1 ఉన్నాయి. వీటితో పాటు పలు క్యారీ ఫార్వార్డ్ పోస్టులు ఉన్నాయి.

# అమల్లోకి ఇంటర్ బోర్డులో సంస్కరణలు

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యలో పలు సంస్కరణలు తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఐదు సబ్జెక్టులకు బదులు ఆరు సబ్జెక్టులను ఎంచుకోవల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఎంపిక చేసుకున్న ఆరో సబ్జెక్టులో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో తీసుకువచ్చిన అనేక సంస్కరణలపై సందేహాలు వ్యక్తమవుతుండటంతో బోర్డు ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. ఫస్ట్ ఇయర్‌లో పార్ట్ 1 కింద ఇంగ్లిస్ సబ్జెక్టు ఉంటుంది. పార్ట్ 2 కింద తెలుగు, సంస్కృతం, అరబిక్ ఇలా భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు సబ్జెక్టులు కూడా ఉంటాయి.పార్ట్ 3లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి.

అభ్యర్థి ఎంపీసీ గ్రూపు ఎంపిక చేసుకుంటే గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. అయితే విద్యార్థి ఎంపీసీ గ్రూపు తీసుకొని గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంగ్లిష్, తెలుగు చదువుతూ ఆరో సబ్జెక్టుగా జీవశాస్త్రం తీసుకున్నాడనుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఉండదన్నమాట. అంతేకాకుండా ఆరో సబ్జెక్టులో ఫెయిల్ అయినా ఐదు సబ్జెక్టులు పాసైనట్లు మెమో ఇస్తారు. ఒకవేళ ఆరో సబ్జెక్టులోనూ పాసైతే ప్రత్యేకంగా మరో మెమో జారీ చేస్తారు.కానీ పార్ట్2లో తెలుగు, సంస్కృతం, అరబిక్‌లాంటి భాష సబ్జెక్టులతోపాటు గ్రూపు ఆప్షనల్ సబ్జెక్టులు కలిపి మొత్తం 24 వరకు ఉంటాయి. వీటిల్లో ఏ సబ్జెక్టునైనా విద్యార్థి ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎంపీసీ విద్యార్థి గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆంగ్ల భాష సబ్జెక్టుతోపాటు జీవశాస్త్రాన్ని ఎంపిక చేసుకుంటే జీవశాస్త్రంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత తప్పనిసరన్నమాట. వీళ్లు జేఈఈతోపాటు నీట్ పరీక్ష కూడా రాసుకోవచ్చు. ఒకే కోర్సులో ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చదివేందుకు అర్హత లభిస్తుంది. ఈ మేరకు ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను ప్రవేశ పెట్టడంతోపాటు ప్రశ్నపత్రాల విధానాన్ని మార్పు చేశారు. గతంలోలానే ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉంటాయి. వీటిల్లో పార్ట్ 2లో ఎంపిక చేసిన సబ్జెక్టును చదువుకోవచ్చు. వీటితోపాటు విద్యార్థి ఆసక్తి మేరకు అదనంగా ఆరో సబ్జెక్టు చదువుకోవడానికి వీలుంటుంది.

# కశ్మీర్ కొండల్లో ఉగ్రవాదులు

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. లష్కర్‌ఎతొయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించిన ఈ దాడిలో 26 మంది, అందులో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు మరణించారు. ఉగ్రవాదులు కార్బైన్‌లు, అఓ47 రైఫిళ్లతో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటన తర్వాత, కేంద్ర ప్రభుత్వం భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను మంజూరు చేసింది, ఉగ్రవాదులను అంతమొందించేందుకు తీవ్ర శోధన కార్యకలాపాలను ప్రారంభించింది.పహల్గాం దాడి తర్వాత, భారత సైన్యం, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్తంగా పూంఛ్, బారాముల్లా, పహల్గాం అడవుల్లో ఉగ్రవాదుల కోసం భారీ శోధనను ప్రారంభించాయి. హెలికాప్టర్‌లు, డ్రోన్‌లతో ప్రతి అంగుళాన్ని జల్లెడ పడుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించబడుతోంది, ఇందులో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన నేత్రా డ్రోన్‌లు 240 డిగ్రీల కవరేజ్‌తో రియల్‌టైమ్ డేటాను అందిస్తాయి. ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న ఇఞ/ఛ2090 రాడార్ సిస్టమ్స్ 450 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తిస్తాయి. ఇస్రో ఉపగ్రహాల నుంచి పొందిన రియల్ టైమ్ ఇమేజరీ ఉగ్రవాదుల స్థానాలను ఖచ్చితంగా గుర్తించడంలో సహాయపడుతోంది.

# పహల్గాం హత్యాకాండపై వేములవాడ ముస్లింల ఆవేదన

- పహల్గామ్ బాధితులకు సంఘీభావం
- వేములవాడలో నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల వేములవాడ పట్టణ ముస్లింలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ దారుణాన్ని నిరసిస్తూ, తిప్పాపూర్ అర్భా ఈ మసీదులో జుమా నమాజు సందర్భంగా ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ...."ఇలాంటి అరాచకమైన ఉగ్రవాద చర్యలతో దేశ సమగ్రతను భంగం చేయాలని చూస్తున్నవారు ఎప్పటికీ విజయం సాధించలేరు. అమాయకుల ప్రాణాలను బలిగొనడాన్ని ఖండించటం మానవతా బాధ్యత. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని తక్షణమే పట్టుకొని కఠినంగా శిక్షించాలి," అని ప్రభుత్వాన్ని కోరారు."మన సైనిక బలగాలు దేశాన్ని రక్షించడంలో త్యాగాలకు దిగుతున్న వేళ, ఉగ్రవాదులు గౌరవాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడటం బాధాకరం," అని వారు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు కులమతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒక్కటై జాతీయ భావాన్ని చాటాలన్నారు. అలాగే, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మరింత కఠినమైన చట్టాలను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పహల్గామ్ ఉగ్రదాడి హేయమైన చర్య

- ఉగ్రవాద దాడులు దేశ సమైక్యతను దెబ్బతీయలేవు
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్






వేములవాడ, (ప్రశ్న న్యూస్) జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి బాధాకరమని, ఈ దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామని వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, దాడిలో మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ అంబేద్కర్ చౌరస్తా నుండి మహంకాళి చౌరస్తా వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని రాజరాజేశ్వర స్వామివారిని ప్రార్థించాను" అని తెలిపారు. ఉగ్రవాదం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు భారంగా మారిందని, అటువంటి చర్యలను ప్రోత్సహించే దేశాలు మనగడ సాధించలేవని హెచ్చరించారు. భారత ప్రజల సమైక్యతను, ధైర్యాన్ని ఇటువంటి దాడులు ఏ మాత్రమూ దెబ్బతీయలేవని స్పష్టం చేశారు.ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా జాతి అంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను గుర్తించి, వారి సంస్థలను బహిరంగపరిచి కఠినంగా శిక్షించాలన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం సంకోచం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపాన్ని తెలిపారు.

# ఒకే చోట.. మంటగలిసింది.. వికసించింది మానవత్వం

ప్రస్తుత ప్రపంచంలో మానవత్వం మచ్చుకైనా కనబడుట లేదు అనేది సాధారణంగా వింటున్నాం. కొన్ని కొన్ని సందర్భాలలో మనిషి మృగమయ్యాడని చెబుతున్నాం. నిజమే మానవత్వం మంటకలిసింది అని చెప్పడానికి సాక్ష్యాలు లేకపోలేదు. రోజు పేపర్లలో ఎన్నో వార్తలు చదువుతున్నాం. టీవీల్లో ఎన్నో వార్తలు వింటున్నాం. అవి చూస్తున్నప్పుడుగాని వింటున్నప్పుడుగాని మానవతం మంటగలిసింది. మనిషన్న వాడు మాయమైపోతున్నాడని చెప్పుకుంటున్నాం. మంచి ఉన్న ప్రతిచోట చెడు ఉంటుంది చెడు ఉన్న ప్రతి కోట మంచి ఉంటుంది అనేది వాస్తవం. ఈ వాస్తవాన్ని మనం పహల్గంలో చూశాం.
భూలోక స్వర్గంగా పిలవబడే కశ్మీర్ మనదేశంలో ఎంతో గొప్పది. ప్రకృతి పరంగానే కాకుండా రెండు దేశాల మధ్య రగడలకు కాశ్మీర్ మూలం. ఎన్నో ఏళ్లుగా ప్రకృతి ప్రియులు అక్కడికి వెళ్లాలంటే ప్రాణం గుప్పెట్లో పెట్టుకుని భయపడుతూనే వెళ్తారు. గత కొన్నేళ్లుగా మానవ రూపంలో ఉన్న టెర్రరిజం అనే భూతం అక్కడ తిరగడం కాస్త తగ్గిందని భావించిన జనం. అక్కడికి రాకపోకలను మొదలు పెట్టారు. కశ్మీర్ అందాలను ఆస్వాదిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా బిక్కు బిక్కు మంటూ బతికే కశ్మీర్ ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరిపీల్చుకున్నారు. ఇంతలోనే నేనున్నానంటూ ఉగ్రవాద భూతం. ప్రకృతి ప్రియులపై తూటాల విషం చిమ్మింది ఈ విషానికి 28 మంది బలయ్యారు. ఇదే సమయంలో ఉగ్రవాదుల నుంచి పర్యాటకులను కాపాడే ప్రయత్నం చేశారు కాశ్మీరీ ప్రజలు. అక్కడే ఉన్న ఒక పోనీ హార్స్ రైడర్ అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. చివరికి ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. పహల్గామ్‌లోని బైసరన్ గడ్డి మైదానానికి తన గుర్రంపై పర్యాటకులను తీసుకెళ్లిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా.. పర్యాటకులను రక్షించడానికి ఉగ్రవాదుల్లోని ఒకడితో పోరాడటానికి ప్రయత్నించాడు. అప్పుడు ఉగ్రవాదులు ఆదిల్ కాల్చి చంపబడ్డాడు. ఇదిలా ఉంటే ఉగ్రవాదుల దాడికి బెదిరిపోయిన పర్యాటకులకు అక్కడి ప్రజలు ఉచితంగా సేవలు చేస్తున్నారు. ఓ డాక్టర్ తన ఇంటినే ఆసుపత్రిగా మార్చి ప్రజలకు సేవ చేస్తున్నాడు. కొంతమంది టీ పానీయాలు ఉచితంగా అందిస్తున్నారు. ఒకే చోట ఒకే మతంలో ఒకరిలో వికసించిన మానవత్వం. ఇంకొకడిలో మంటగలసిన మానవత్వం. ఒక మతంలో కానీ, ఒక కులంలో కానీ, ఒక జాతిలో కాని అందరూ చెడ్డవారు ఉండరు. అందరూ మంచివారు ఉండరు. చేతికి ఉన్న ఐదు వేళ్ళే సమానంగా ఉండనప్పుడు అందరూ చెడ్డవారు ఎలా ఉంటారు. చెడును ద్వేషించండి తప్పులేదు.. మంచిని కూడా గుర్తించండి.. అప్పుడే కులమతాల చిచ్చులు మన దరి చేరవు..



(ఉగ్రవాదం హతమవ్వాలని అదే అల్లాను నేను ప్రార్థిస్తున్నాను.)
**కవిరత్న అమీనా కలందర్ సీనియర్ జర్నలిస్ట్**

జమ్మూకశ్మీర్‌లో పహల్గామ్ మంగళవారం వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న అందమైన ప్రాంతం. భూతల అందాలతో పర్యాటకులను అలరించే ప్రదేశంలో ఉగ్రవాదుల దాడితో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆటపాటలతో సందడిగా గుడుపుతున్న ప్రాంతంలో

# కూలి అనే పదానికి బదులుగా గ్రామీణ వికాస శ్రామికుడు అనే పదాన్ని వాడాలి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి(ప్రశ్న న్యూస్) పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమరావతిలోని సికె కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళగిరిలో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను పంచాయతీరాజ్ శాఖను చాలా ఇష్టంగా ఎంచుకున్నానని చెప్పారు. పల్లెల్లో ఉండడం అంటే తనకు ఇష్టమని తెలిపారు. పల్లె నిధులు వాటికే ఉపయోగించాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారుల కృషితో పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతున్నాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. బిల్లులు రాక పోయిన పనులు చేసిన గుత్తేదారులకు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకంలో 75 లక్షల మందికి పైగా శ్రామికులు నిధులు ఇచ్చామని పవన్ తెలిపారు. ఇక ఉపాధి హామీ పథకంలో కూలి అనే పదానికి బదులుగా గ్రామీణ వికాస శ్రామికుడు అనే పదాన్ని వాడాలని ఆయన సూచించారు. ఇకపై ఎవరూ కూడా కూలి అనే పదాన్ని వాడకూడదని తెలిపారు.

# వేములవాడలో "హోమ్ టౌన్ ఫుడ్ కోర్ట్" శుభారంభం

- ఆహార ప్రియులకు కొత్త చిరునామా
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్





వేములవాడ, (ప్రశ్న న్యూస్) భక్తుల రద్దీతో కిటకిటలాడే వేములవాడకు మరో ఆకర్షణగా "హోమ్ టౌన్ ఫుడ్ కోర్ట్" జతకానుంది. పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మితమైన ఈ ఫుడ్ కోర్ట్‌ను శుక్రవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రమంతటా నుంచి వేములవాడకు వచ్చే భక్తులకు శుద్ధమైన, రుచికరమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ హోటల్ అభినందనీయం. ఇక్కడి వంటకాలు నన్ను నిజంగా ఆకట్టుకున్నాయి" అన్నారు. ప్రత్యేకించి ప్యూర్ వెజిటెబుల్ టిఫిన్స్, భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం శ్లాఘనీయం అన్నారు. హోటల్ నిర్వాహకుడు మొట్టల మహేష్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామతీర్థపు మాధవి రాజు, ఎస్ఆర్ఆర్ అధినేత తోట రాంకుమార్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మాజీ కౌన్సిలర్ నరాల శేఖర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, పట్టణ సీఐ వీరప్రసాద్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ సభా స్థలిని సందర్శించిన వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ బృందం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) ఈ నెల 27వ తేదీన ఆదివారం వరంగల్ ఎల్కతుర్తి ఎక్స్ రోడ్ వద్ద తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాట్లను వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడ



లక్ష్మీ నరసింహారావు తదితర పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.వేములవాడ నియోజకవర్గం అన్ని మండలాల ముఖ్య నాయకులతో కలిసి సభా ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన, నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో పాల్గొనే నాయకులు, కార్యకర్తలు, ప్రజల కోసం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నేతలు, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఆయనతో కలిసి ఉన్నారు.

# మేం తలచుకుంటే పాకిస్తాన్ రూపురేఖలు కూడ మిగలవు

- ఉగ్రవాదులకు కాంగ్రెస్ నేతల వార్నింగ్
- పాకిస్తాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మిన్నంటిన నిరసనలు



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ లో కాశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత మత ఛాందస ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన అమాయక పర్యాటకులకు కొత్తగూడెం పౌర సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన దీక్ష కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించి, పాకిస్తాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పహిల్గమ్ ఘటనలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన కుటుంబాలకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, జెవిఎస్ చౌదరి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు మాట్లాడుతూ ఈ దారుణానికి పాల్పడిన వారిని, కుట్ర పన్నిన వారిని బయటకు లాగి తగిన గుణపాఠం చెప్పాలని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్న శక్తులను విడిచిపెట్టకూడదని, ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడే వారికి త్వరలో గట్టి సమాధానమిచ్చి ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నారు. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని, భారత్ అతి పురాతన దేశమని, ఉగ్రవాదానికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఈ సమయంలో ఉగ్రబాధిత కుటుంబాలకు సంఘీభావంగా అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. అత్యంత పాషవికంగా మతం ఏంటో అడిగి మరీ భారత ప్రజలను కాల్చి చంపడం హేయమైన చర్య అని అభివర్ణించారు. ముఖ్యంగా ఉగ్రవాదులు పర్యాటకుల వస్త్రాలు విప్పి వారు ఏ మతం వారు గుర్తించి మరి వేటాడి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపుడి శేఖర్, కెకె శ్రీనివాస్, పోస్టాఫీస్ వాసు, బాల పాసి, పూనెం శ్రీనివాస్, మైనారిటీ నాయకులు గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ డివిజన్ అంబేద్కర్ సంఘం భవన నిర్మాణ కమిటీ ఎన్నికలు

- కన్వీనర్‌గా కుమ్మరి శంకర్ ఎన్నిక



వేములవాడ,(ప్రశ్న న్యూస్,) వేములవాడ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం వేములవాడ డివిజన్ అధ్యక్షుడు దుమ్మ ఆనంద్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అంబేద్కర్ సంఘం భవన నిర్మాణ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.కమిటీ కన్వీనర్‌గా కుమ్మరి శంకర్ ఎన్నికయ్యారు. కో-కన్వీనర్లుగా గసికంటి ప్రభాకర్, గుడిసె మనోజ్ కుమార్, గుండా థామస్, మూలే కిషోర్, జింక శ్రీధర్, సంటి మహేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య సలహాదారులుగా బొడ్డు రాములు, ఆవునూరి ప్రభాకర్‌లు, కమిటీ సభ్యులుగా జింక శ్రీనివాస్, గుర్రం తిరుపతి, సామల్ల ప్రతాప్, పెంట బాబు, పెంట దుర్గాప్రసాద్, సంటి అంజిబాబు, గురగళ్ళ భానయ్యలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కన్వీనర్ కుమ్మరి శంకర్ మాట్లాడుతూ %-% "వేములవాడ డివిజన్ కేంద్రంగా అంబేద్కర్ భవన నిర్మాణానికి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రూ.1 కోటి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి మన కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం" అని తెలిపారు.వేములవాడ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాక, మహనీయుల ఆశయ సాధనకు అనుగుణంగా పలు కార్యక్రమాలను కమిటీ చేపడుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో డివిజన్ స్థాయి అంబేద్కర్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రామ్ గోపాల్ వర్మ లేకపోతే
# నేను లేను : మనోజ్ బాజ్‌పేయ్



విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు మనోజ్ బాజ్‌పేయ్. సత్య, 'ది ఫ్యామిలీ మ్యాన్', గ్యాంగ్స్ ఆఫ్ వాసిపూర్ చిత్రాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. అయితే ఇటీవల ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ప్రయాణం టురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు బాజ్‌పేయ్. తన కెరీర్‌లో సత్య ఒక మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పాడు.బండిట్ క్వీన్ సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. శేఖర్ కపూర్ లాంటి దిగ్గజ దర్శకుడు తీసిన చిత్రంతో గుర్తింపు వస్తుందనుకున్నాను కానీ అలా జరుగలేదు. అయితే బండిట్ క్వీన్ చూసి వర్మ నన్ను సత్య సినిమాకి ఎంపిక చేసుకున్నాడు. మొదట హీరోగా అనుకున్నాను కానీ హీరో స్నేహితుడి పాత్రలో అని దిగులు చెందాను. కానీ సినిమా విడుదలైన తర్వాత హీరో కంటే హీరో స్నేహితుడి పాత్రకే ఎక్కువ ప్రశంసలు దక్కాయి. నాకు నిజంగా గుర్తింపును తెచ్చిపెట్టింది మాత్రం 'సత్య' సినిమానే. ఆ చిత్రంలో నన్ను నమ్మిన రామ్ గోపాల్ వర్మ గారికి ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. ప్రతిరోజూ ఆయనను తలుచుకుంటాను. ఆయనతో కలిసి నేను వరుసగా నాలుగు ప్రాజెక్టులలో పనిచేశాను. మూడు సినిమాల్లో నటించాను, ఒక చిత్రానికి నిర్మాతగా వ్యవహరించాను. నా సినీ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపంటూ మనోజ్ వెల్లడించారు. సినీ పరిశ్రమలో తాను పడ్డ కష్టాల గురించి చెబుతూ.. 30 ఏండ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు చూశాను. ఈ చిత్ర పరిశ్రమలో నిలబడటం అంత సులభమైన విషయం కాదు. ఇక్కడ చాలా పోటీ ఉంటుంది. మన ఎదుగుదలను చూసి తొక్కేవాళ్లు ఉంటారు. అలాంటి పరిస్థితులను తట్టుకుని నిలబడి ఈ స్థాయికి చేరుకున్నానంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు.

# అతనితో నాది ప్రత్యేక బంధం

### – ఆ అనుబంధానికి పేరు పెట్టలేను: సమంత



సినీ హీరోయిన్ సమంత తాజాగా కోలీవుడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'గోల్డెన్ క్వీన్' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తన కెరీర్, వ్యక్తిగత బంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌తో తనకున్న అనుబంధం గురించి ఆమె భావోద్వేగంగా మాట్లాడారు. తనకు ఆరోగ్యం బాగాలేని క్లిష్ట సమయంలో రాహుల్ రవీంద్రన్ అండగా నిలిచాడని సమంత తెలిపారు. "ఉదయం నుంచి సాయంత్రం వరకు నాతోనే ఉంటూ రాహుల్ నన్ను జాగ్రత్తగా చూసుకున్నాడు. మా బంధానికి ఓ పేరు పెట్టలేను. స్నేహితుడా, సోదరుడా, కుటుంబ సభ్యుడా అనేది చెప్పలేను" అంటూ రాహుల్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తపరిచారు. అభిమానుల మద్దతు తన అదృష్టమని, తన కష్టం, లక్ వల్లే ఇంత ఆదరణ లభిస్తోందని ఆమె పేర్కొన్నారు. కెరీర్ గురించి మాట్లాడుతూ, "మనం తీసుకునే ఒక్క నిర్ణయాన్ని బట్టి కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. తెలిసీ, తెలియక తీసుకునే ఎన్నో నిర్ణయాలు మన ప్రయాణంపై ప్రభావం చూపుతాయి" అని సమంత అన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న దర్శకురాలు సుధ కొంగర సమంతపై ప్రశంసలు కురిపించారు. తాను సమంతకు పెద్ద అభిమానినని, గత ఐదేళ్లుగా ఆమెను దగ్గర నుంచి చూస్తున్నానని తెలిపారు. ఆమె కష్టాలు చూసి కన్నీళ్లు వచ్చేవని, ఎంతోమంది అమ్మాయిలకు సమంత స్ఫూర్తి అని అన్నారు. "సమంతతో సినిమా తీయాలని రెండుసార్లు ప్రయత్నించినా కుదరలేదు. కానీ ఎప్పటికైనా ఆమెతో కచ్చితంగా సినిమా తీస్తాను. ఆమె నటించిన 'ఊ అంటావా..' పాట నాకెంతో ఇష్టం" అని సుధ కొంగర చెప్పారు.

దీనికి సమంత స్పందిస్తూ, తనకు యాక్షన్ సినిమా చేయాలని ఉందని తెలిపారు. తప్పకుండా యాక్షన్ సినిమా చేద్దామని సుధ కొంగర బదులిచ్చారు.

# 'సారంగపాణి జాతకం' మూవీ రివ్యూ



కమెడియన్‌గా, నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి ఇటీవల 'కోర్టు' సినిమాతో విజయాన్ని అందుకున్నాడు. కమెడియన్‌గా నటిస్తూనే మరోవైపు హీరోగా వైవిధ్యమైన సినిమాలు చేస్తున్న ప్రియదర్శి కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జాతకం ఎలా ఉందో..సారంగపాణి జాతకం ఎలాంటి కథాంశం? ఈ చిత్రంలో ప్రేక్షకులను మెప్పించే అంశాలున్నాయా? లేదా తెలుసుకోవాలంటే ఈ చిత్రం జాతకంలోకి అదేనండి.. రివ్యూలోకి వెళ్లాల్సిందే.. కథ: చిన్నప్పటి నుంచి జాతకాలను నమ్మే సారంగపాణి (ప్రియదర్శి) ఓ కార్ల షోరూమ్‌లో సేల్స్‌మేన్‌గా పనిచేస్తుంటాడు. అక్కడే పనిచేస్తున్న షోరూమ్ మేనేజర్ మైథిలి (రూపా కొడవయార్) ని ప్రేమిస్తాడు. ఇరువైపుల పెద్దలు అంగీకరించడంతో నిశ్చితార్థం జరుపుకుంటారు. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. అయితే అనుకోకుండా జగేశ్వరనంద్ (శ్రీనివాస్ అవసరాల) సారంగపాణి చేతి రేఖలు చూసి నీచేతి రేఖల్లో 'నువ్వు ఓ వ్యక్తిని మర్డర్ చేస్తావని ఉంది' అని చెబుతాడు.

పెళ్లి తరువాత తన వల్ల తన ప్రేయసికి ఎలాంటి సమస్యలు రాకూడదని పెళ్లి వాయిదా వేస్తాడు? అంతేకాదు పెళ్లికి ముందే తన ప్రమేయంతో తను ఈజీగా తప్పించుకునేలా ఓ మర్డర్ చేసి, దానితో తనకు సంబంధం లేదని అనిపించుకున్న తరువాత పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అవుతాడు. అయితే సారంగపాణి ఎవరిని మర్డర్ చేయాలనుకుంటాడు? మైథిలికి, సారంగపాణికి మధ్య జరిగిందేమిటి? వ్యాపారవేత్త అయినా అహెూబిల్ రావు (తనికెళ్ల భరణి)ను సారంగపాణి ఎందుకు కలవాల్సి వచ్చింది? సారంగపాణి మర్డర్ చేశాడా? అసలు జరిగిందేమిటి తెలుసుకోవాలంటే సినిమా చూసి తెలుసుకోవాలి. విశ్లేషణ: జీవితం మొత్తం మన చేతుల్లోనే ఉంటుంది అంటూ జాతకాలు నమ్మే యువకుడి కథ చుట్టూ, ఓ మర్డర్ థ్రిల్లర్ అంశాన్ని జోడించి ఈ కథను అల్లుకున్నారు దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ. అయితే వినోదాన్ని ఆకట్టుకునేలా రాసుకోవడంలో మోహనకృష్ణలో ఉన్న ప్రతిభ ఈ సినిమాకు బాగా ప్లస్ అయ్యింది. ఆయన మార్క్ ఆఫ్ కామెడీతో ప్రతి సన్నివేశాన్ని ఎంతో జనరంజకంగా తీర్చిదిద్దాడు. ప్రతి సన్నివేశంలో ఎంతో హిలేరియస్ ఫన్‌ను క్రియేట్ చేయగలిగాడు. ముఖ్యంగా సినిమాలో సంభాషణలు హిలేరియస్‌గా ఉంటాయి. ప్రతి పంచ్‌కు ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటారు. ముఖ్యంగా కథలోని క్యారెక్టర్లు పండించే కామెడీని రాసుకోవడంలో ఆయన ఎంతో సక్సెస్ అయ్యాడు. ఫస్ట్‌హాఫ్ హిలేరియస్ కామెడీతో కొనసాగితే.. సెకండాఫ్ మిడిల్‌లో కాస్త తడబడినట్లుగా అనిపిస్తుంది. అయితే ప్రీ క్లైమాక్స్, పతాక సన్నివేశాల్లో నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉండటంతో సినిమా హిలేరియస్ కామెడీతోనే ఎండ్ అవుతుంది. చాలా రోజుల తరువాత సిట్యుయేషనల్ కామెడీతో, డీసెంట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఈ చిత్రంలో చూడొచ్చు. ముఖ్యంగా చైనీస్ వంటకాలు, మింగ్ చావ్, చెడిపో వంటి పద ప్రయోగాలు ఆడియన్స్‌ను నవ్వించాయి. అయితే జాతకాన్ని మరీ అంత గుడ్డిగా నమ్ముతూ ఓ వ్యక్తిని చంపాలని, ఈ కారణంతో తన పెళ్లిని వాయిదా వేసుకోవాలని హీరో అనుకోవడం అనేది పెద్దగా కన్విన్సింగ్ అనిపించదు. అయితే ఇలాంటి వాళ్లు కూడా ఉంటే అనే ఊహ నుంచి అల్లుకున్న కల్పితకథతో ఇంద్రగంటి నుంచి పుట్టిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ ఇది. దాదాపు ఈ చిత్రంలో ప్రతి ఏపిసోడ్ ఆడియన్స్‌ను నవ్విస్తుంది. సెకండాఫ్‌లో హెూటల్‌లో జరిగే సన్నివేశాలు, చావు ఇంట్లో చిన్న పిల్ల చేతిలో హీరో కేకు లాక్కునే సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయి. యూత్ కనెక్ట్ అయ్యే వినోదం కూడా ఈ చిత్రంలో ఉండటం మరో ఎస్సెట్.

నటీనటుల పనితీరు: ఇటీవల కోర్టు సినిమాలో లాయర్‌గా సీరియస్ పాత్రలో కనిపించిన ప్రియదర్శి, ఈ చిత్రంలో సారంగపాణిగా చక్కని నటన కనబరిచాడు. తన నటనతో నవ్వులు పూయించాడు. వెన్నెల కిషోర్ పంచ్‌లు, ఆయన ఎక్స్‌ప్రెషన్స్ అలరిస్తాయి. హర్ష చెముడు కూడా హెూటల్ చెఫ్‌గా, స్నేహితుడిగా వినోదాన్ని పంచాడు. ముఖ్యంగా ఈ చిత్రంలో దర్శకుడు ప్రతి పాత్రను డిజైన్ చేసిన విధానం బాగుంది. హీరోయిన్‌గా రూపా కొడువాయిర్ తన నటనతో ఆకట్టుకుంది. తనికెళ్ల భరణి అవసరాల శ్రీనివాస్, నరేష్, శ్రీనివాస్, వడ్లమాని రూప లక్ష్మీ తమ పాత్రలో రాణించారు. పీజీ విందా ఫోటోగ్రఫీ కథ మూడ్‌ను క్యారీ చేసింది. నేపథ్య సంగీతం సన్నివేశానికి ప్లస్ కాకపోయినా, ఆ సీన్‌ను ఇబ్బందిపెట్టే విధంగా మాత్రం లేదు.

జాతకాలు నమ్మే ఓ యువకుడి పాత్ర చుట్టూ అల్లుకున్న కథతో ఇంద్రగంటి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించాడు. ప్రతి సన్నివేశంలో కడుపుబ్బ నవ్వించే కామెడీ ఉన్న ఈ చిత్రం ఈ వేసవికి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

ఎంటర్‌టైన్‌మెంట్ కోరుకునే ఆడియన్స్‌కు 'సారంగపాణి జాతకం' పూర్తి స్థాయిలో సంతృపినిస్తుంది. తప్పనిసరిగా అందరూ కుటుంబంతో చూసి ఎంజాయ్ చేయాల్సిన సినిమా ఇది. వేసవి సెలవులు కావడం కూడా కమర్షియల్‌గా సారంగపాణి జాతకం సినిమాకు కలిసొచ్చే అంశం. సారంగపాణి జాతకం వసూళ్ల పరంగా కూడా దివ్యంగా ఉన్నట్లే...

# నాని 'హిట్ 3' మూవీ

### – 13 ఏళ్ల లోపు పిల్లలకు నో ఎంట్రీ!




నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్ 3' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి కేంద్ర సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సినిమాలో హింసాత్మక సన్నివేశాలు, రక్తపాతం వంటి అంశాలు మోతాదుకు మించి ఉన్నాయని సెన్సార్ సభ్యులు అభిప్రాయపడినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే చిత్రానికి 'ఏ' (పెద్దలకు మాత్రమే) సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో 13 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఈ సినిమా వీక్షించడానికి అనుమతి ఉండదు.'దసరా', 'సరిపోదా శనివారం' వంటి చిత్రాల తర్వాత నాని నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు, తన సొంత నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు.సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. నాని స్వయంగా ఈ ప్రమోషన్లలో చురుకుగా పాల్గొంటూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు. 'హిట్' సిరీస్‌లో గత చిత్రాలు విజయవంతం కావడం, ఈ సినిమాలో నాని పాత్ర పూర్తి భిన్నంగా ఉండనుందన్న ప్రచారం జరుగుతుండటం సినిమాకు కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. అయితే, తీవ్రమైన హింసాత్మక సన్నివేశాలతో వస్తున్న 'హిట్ 3' ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో, వారి అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో తెలియాలంటే మే 1 వరకు వేచి చూడాల్సిందే.

# పెళ్లి తర్వాత జాక్ పాట్ కొట్టిన కీర్తి సురేష్..



### దీంతో అయిన తలరాత మారుతుందా?

కీర్తి సురేష్.. ఈ అమ్మడు పేరు చెబితే మహానటి సినిమానే గుర్తుకు వస్తుంది. మూవీలో సావిత్రిగా నటించి అందరి మన్ననలు అందుకుంది. ఇక కీర్తి సురేష్ టాలీవుడ్ టాప్ హీరోల సరసన కూడా నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. అప్పట్లో కీర్తి సురేష్‌ని వరుస హిట్స్ పలకరించిన ఇప్పుడు మాత్రం హిట్ దొరకడం కష్టంగా మారింది. గత కొంత కాలంగా టాలీవుడ్‌లో కూడా అవకాశాలు దక్కించుకోలేకపోతుంది. టాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ ముద్దుగుమ్మ.. కోలీవుడ్, బాలీవుడ్ లో మాత్రం పలు సినిమాలో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది.మొదట్లో పద్దతిగా ఉన్న కీర్తి సురేష్ ఇటీవల గ్లామర్ డోస్ కూడా పెంచింది. పెళ్లయిన తర్వాత అమ్మడు గ్లామర్ షోలకు దూరంగా ఉంటుందని అంతా అనుకున్నారు దీనికి భిన్నంగా ముందుకంటే మరింతగా గ్లామర్ షోలు చేస్తూ రెచ్చిపోతుంది.రు. గత సంవత్సరం అట్లీ నిర్మాణంలో విడుదలైన బేబీ జాన్ చిత్రం ద్వారా హిందీలోకి అడుగుపెట్టింది కీర్తి సురేష్. ఆ చిత్రంతో కీర్తి బాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంది. కాని మూవీ పరాజయం చెందడంతో తిరిగి దక్షిణాది సినిమాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారట. రీసెంట్ గా కీర్తి సురేష్ మరో జాక్‌పాట్ కొట్టినట్టు తెలుస్తోందిసార్, లక్కీ బాస్కర్ వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటించనున్నారట.

సూర్యా 46వ సినిమాగా ఈ చిత్రం రూపొందుతుండగా, ప్రస్తుతం ఈసినిమాకు సబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. 7 ఏళ్ల క్రితం సూర్య, కీర్తి సురేష్ కాంబినేషన్ లో గతంలో ఒక సినిమా వచ్చింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో వచ్చిన ఓ సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. కాని ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమా వచ్చిన దాదాపు 7 సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ సూర్యతో కలిసి నటిస్తుంది. మరి ఈ చిత్రంతో అయిన అమ్మడి ఫేట్ మారుతుందా చూడాలి.

# పర్యాటకులపై ఉగ్ర దాడి అమానుష చర్య

**-వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకరి కుమార్**



మంథని( ప్రశ్న న్యూస్) కశ్మీర్ లోని పహల్గాంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అమాయక పర్యాటకులను టెర్రరిస్టులు కాల్చి చంపిన ఘటన అత్యంత హేయమైన చర్య అని వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంకరి కుమార్ అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పహల్గాం దుర్ఘటనలో మృతులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారన్నారు అతిక్రూరమైన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాకార్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాంపెల్లి రమేష్, గౌరవ అధ్యక్షులు కొమురోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇసంపల్లి కొమురయ్య, వేల్పుల గట్టయ్య, సహాయ కార్యదర్శులు కుక్కడపు రామ్మూర్తి, కోశాధికారి చిలువేరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంధం ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సహాయ కార్యదర్శి చిట్టిమల్ల సంతోష్, విష్ణు భక్తుల రఘు, తాటి సమ్మయ్య గౌడ్, సాంస్కృతిక కార్యదర్శి లక్కాకుల నాగరాజు, గౌరవ సలహాదారు కర్రు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఒడ్నాల శ్రీనివాస్, ఎం ఎస్ రెడ్డి, ఎక్కేటి మల్లారెడ్డి, జర్నలిస్ట్ లు పోతరాజు సమ్మయ్య, బర్ల సంపత్, హరీష్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు రావుల తిరుమల్ తో పాటు ఓపెన్ జిమ్ అసోసియేషన్ అధ్యక్షులు కూర కోటేష్ సభ్యులు పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు విడుదల చేయాలని

# ఉపాధి హామీ కూలీల ర్యాలీ



మంథని (ప్రశ్న న్యూస్) మంథని మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలో మూడు నెలల ఉపాధి కూలీల బకాయి వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. లిఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ....లి ఉపాధి హామీ పనులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు కూలీలకు బిల్లులు చెల్లించలేదని రెక్కాడితే గాని డొక్కాడని కష్టజీవులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లను మొదలుకొని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని బకాయి వేతనాలు విడుదల చేసి ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద మొత్తంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర

**మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



మంథని ( ప్రశ్న న్యూస్) ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంథని అధ్వర్యంలో మండలంలోని పోతారం, మల్లెపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు అరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు విక్రయించరాదని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గ్రేడ్ ఏ కు రూ.2320, సాధారణ రకానికి 2300మద్దతు ధర పొందాలని సూచించారు. ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సహకార సంఘం ద్వారా 35 కేంద్రాలను ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు దాసరి లక్ష్మి-మొండయ్య, ఉడుత మాధవి- పర్వతాల్ యాదవ్, దేవళ్ల విజయ్ కుమార్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెండ్లి రమ-సురేష్ రెడ్డి, నాయకులు అజీంఖాన్, జాగిరి సదానందం, ఎరుకల మధు, ఎడ్ల ప్రమీల, తాళ్ళపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పాక్ పై ప్రతీకార చర్యకు

# భరత్ సిద్ధం కావాలి

**- తెలంగాణ ఉద్యమ కారుడు,**

**బీజేపీ సీనియర్ నాయకుడు మడుపతి శివకుమార్**

శేరిలింగంపల్లి(ప్రశ్న న్యూస్) జమ్మూ కాశ్మీర్‌లో టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని తెలంగాణ ఉద్యమ కారుడు, బీజేపీ సీనియర్ నాయకుడు మడుపతి శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హల్గాంలో జరిగిన చర్య క్రూర నికృష్టమైన, పిరికి పందల చర్య అని యావత్ భారతదేశం భావిస్తోందని అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు హిందువులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అమానుషమన్నారు. ఈ అమానవీయ ఘటనపై యావత్ భారతం ప్రతిఘటిస్తోందని అన్నారు. ఇదివరకు ఎన్నో సార్లు పాకిస్తాన్ ను భరత్ క్షమించిందని.. ఇకపై అలా ఉండకూడదని.. దేశ ప్రధాని మోడీ పాకిస్తాన్ ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# రాజకీయ లబ్ధికోసం ఆరోపణ చేస్తే సహించాం

## మాల నాయకులపై కొండ రవీందర్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాం .




మంథని( ప్రశ్న న్యూస్) మంథని మాల మహానాడు ఐక్యవేదిక నాయకులపై బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు కొండా రవీందర్ మాట్లాడిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల ఐక్యవేదిక నాయకులు ఆర్ల నాగరాజు, నూకల కమల్ మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు కొండా రవీందర్ తన రాజకీయ లబ్ధి కోసం మాల సంఘాల నాయకులను కించపరిచే విధంగా మాట్లాడారని మాల సంఘం వర్గీకరణ లో రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తుందని ఎయొక్క రాజకీయ పార్టీ నాయకుల మెప్పు కోసం పనిచేయడం లేదని వారన్నారు ఎంపీ వంశీకృష్ణ గెలుపు కోసం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలు తిరిగి ప్రచారం చేసి వంశీకృష్ణ గెలుపు బాధ్యతలను తన భుజాలపై వేసుకొని మంచి మెజార్టీతోని గెలిపించడం జరిగిందని వారన్నారు. అలాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన ఎంపీ వంశీకృష్ణ ఫ్లెక్సీలు చింపేశారని దుష్ప్రచారం చేస్తున్న కొండ రవీందర్ బీఆర్ఎస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదని ఏమైనా సమస్యలు ఉంటే కాంగ్రెస్ పార్టీ వారు చూసుకుంటారని పార్టీలకు మాల సంఘానికి ముడిపెట్టి సొంత రాజకీయాల ప్రయోజనాల కోసం మాల సామాజిక వర్గానికి చెందిన నీవు బహుజన నాయకుడను అని చెప్పుకోవడం సిగ్గుచేటని వారన్నారు. గతంలో రేవెల్లి రాజబాబు చనిపోతే సంఘీభావం తెలియజేయకపోవడంతో పాటు తనను హత్య చేసిన వారికి వత్తాసు పలుకుతూ వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొనడం సిగ్గుచేటని అన్నారు. ఇకపై మాల సంఘం నాయకులపై అనుచిత వాక్యాలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. ఈ సమావేశంలో మాల ఐక్యవేదిక నాయకులు జంజర్ల రాజు, ఎరుకల రమేష్, ఆర్ల నారాయణ, జంజర్ల శ్రీనివాస్, దీకొండ లక్ష్మణ్, నూకల కమల్, ఎరుకల సురేష్, చంద్రు రాజమల్లు పాల్గొన్నారు

# గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలి

- చలి వేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలి
- ఉదయం 10గం.ల్లోగా పింఛన్లు పంపిణీ కావాలి
- పీజీఆర్ఎస్, ఉపాధి హామీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




పార్వతీపురం ( ప్రశ్న న్యూస్ )జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణాల్లో ప్రతివారం పురోగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, హౌసింగ్, నరేగా, తాగునీటి సమస్యలు, గ్రామ వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పెన్షన్ పంపిణీ, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం జన్ మన్ కింద చేపట్టిన గృహాలకు 50వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా మంజూరు చేస్తున్నప్పటికీ ప్రగతి కనిపించడం లేదన్నారు. ఏ పథకానికి లేనివిధంగా ఈ పథకానికి నిధులు కొరత కూడా లేదన్నారు. చేపట్టిన నిర్మాణ పనులకు సంబందించిన బిల్లులు కూడా త్వరగా చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ గుర్తుచేశారు. జిల్లాలోని లే అవుట్లలో నిర్మితమవుతున్న గృహల్లో ఆర్సీ, ఆర్ఎల్ స్టేజీలో 3,149 గృహాలు ఉన్నాయని, వాటిపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈఈలు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో వారం వారం పురోగతి ఉండాలని, ప్రతి వారం 100 గృహాలకు పైగా ప్రారంభమయ్యేలా చూడాలని పేర్కొన్నారు. కొన్ని లే అవుట్లలో నీటి సమస్య ఉందని, వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు ఇది అనువైన సమయమని, కావున గృహ నిర్మాణాలన్నీ ఆగస్టు నాటికి పూర్తికావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, కావున చలివేంద్రాలు అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాలు, ఉపాధి హామీ, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు కచ్చితంగా ఉండాలని, వాటిని పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎవరికి వడదెబ్బ తగల కూడదని, అలా జరిగితే సంబంధిత ఆర్.డబ్ల్యు.ఎస్, ఎంపిడీ ఓ, ఎంఆర్ఓలను బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే ఎక్కడా కూడా తాగునీటి సమస్య ఉండరాదని, ఎప్పటికప్పుడు బోర్ వెల్స్ కు మరమ్మతులు చేపట్టడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని తెలిపారు. పశువుల కొరకు నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వాటికి కూడా నీటిని అందించాలని అన్నారు.ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో పింఛనుదారులు అసంతృప్తి చెందకుండా ప్రతి మండలంలోని ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ రోజున పాల్గొని ఉదయం 7.00గం.ల నుంచి 10.00గం.ల్లోగా శత శాతం పంపిణీ కావాలని అన్నారు. జిల్లాలో 1,521 కొత్తగా వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయని, కావున ఆయా మండలాల్లోని కొత్త పింఛన్ల సొమ్మును కూడా ముందుగా డ్రా చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, హౌసింగ్, డిఆర్డిఏ, డ్వామా పీడీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి ఇ.అప్పన్న, ఏపీఈపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్.డబ్ల్యూ.ఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిలో చనిపోయిన చంద్రమౌళి పాడే మోసిన ఎంపి: సీఎం రమేష్



అనకాపల్లి (ప్రశ్న న్యూస్)పహల్గం ఉగ్రదాడి లో చనిపోయిన విశాఖ వాసి చంద్రమౌళి పాడే మోసిన అనకాపల్లి ఎం.పీ సి.ఎం రమేష్. పహల్గామ్ ఉగ్రదాడిలో బలైన విశాఖపట్నం కు చెందిన చంద్రమౌళి అంత్యక్రియల్లో భాగంగా రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రజా ప్రతినిధులు తో కలసి రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ చంద్ర మౌళి పార్థివ దేహానికి నివాళులు తెలిపి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరంఅంతిమ యాత్రలో పాల్గొని రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలసి పాడె మోసి ఘననివాళులు అర్పించారు.

## ఉగ్రదాడిని నిరసిస్తూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో

# జనసేన కన్నీటి నివాళి:మధులత




తిరుపతి(ప్రశ్న న్యూస్) పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి మూడవరోజు ప్రగాఢ సంతాప సూచికగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన పార్టీ పిఏసి మెంబెర్,ఉమ్మడి చిత్తూర్ జిల్లా అధ్యక్షులు డా.పసుపులేటి హరిప్రసాద్ తిరుపతి నాలుగు కాళ్ల మండపం దగ్గర మానవహారంగా నిలబడి నిరసన వ్యక్తం చేయడం జరిగిందని జనసేన సీనియర్ నాయకురాలు మధులత అన్నారు. ఈ సందర్భంగా మధులత, ఆకేపాటి సుభాషిణి, ఆకుల వనజ మాట్లాడుతూ ఉగ్రవాదులు హిందూవా, ముస్లిం మా అని హింసించి దాడి చేయడం మరింత దారుణ సంఘటనన్నారు. ఆ తీవ్ర సంఘటనలో భాగంగా జనసేన అధినేత ఆదేశాల మేరకు మూడవ రోజూ సంతాప సూచికగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జనసేన పెద్దలు ,నాయకులతో, కార్యకర్తలతో మానవహారంగా నిలబడి నిరసన వ్యక్తం చేశామని జనసేన సీనియర్ మహిళా నేత మధులత తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకురాలు ఆకేపాటి సుభాషిణి, ఆకుల వనజ, తిరుపతి టౌన్ ప్రెసిడెంట్ రాజా రెడ్డి, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు మధులత, జయతమ్మ, అమృత, శిరీష, దుర్గ, రాధా, చందన, శాంతి, శ్యామల, రాధాశ్రీ, లావణ్య, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## చీర్యాల లక్ష్మీ నర్సింహా స్వామీకీ ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీమంత్రి మల్లారెడ్డి



కీసర (ప్రశ్నన్యూస్ ) మేడ్చల్ జిల్లా కీసర మండలంచీర్యాల గ్రామంలోని శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభ వేడుకలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి బ్రహ్మోత్సవాల ప్రారంభ వేడుకలో దైవ దర్శనం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దైవ ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్, కీసర మండల టిఆర్ఎస్ నాయకులు లక్ష్మీ నరసింహా స్వామి టెంపుల్ చైర్మన్ మల్లారం లక్ష్మీనారాయణ,కుటుంబ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 139వ మే డే పురస్కరించుకొని

# వేములవాడలో పోస్టర్ ఆవిష్కరణ

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడలోని లేబర్ అడ్డా వద్ద 139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వినోదం అనే నినాదంతో 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలోని హే మార్కెట్‌లో కార్మికులు చేపట్టిన సమ్మె సందర్భంగా పెట్టుబడి దారులు జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో ఎర్ర జెండా జన్మించిందని గుర్తుచేశారు.నేటికీ 8 గంటల పని విధానం పూర్తిగా అమలు కావడం లేదని, ఇది లేబర్ డిపార్ట్‌మెంట్ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రతి నెలా లేబర్ ఆఫీసర్లు కార్మికులతో సమావేశాలు నిర్వహించాలన్న డిమాండ్‌ను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సిర్ర లక్ష్మన్, రాజన్న, తోట వెంకటేశం, సంధ్య, రాజవ్వ, లక్మి, పొసవ్వ తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తమైన హైదరాబాద్ ట్రాఫిక్

## - ట్రాఫిక్ సమస్యపై చర్యలేవి

- ఫోటోగ్రాఫర్ల అవతారంలో పోలీసులు - రోడ్డు నిబంధనలకు తిలోదకాలు
- ద్విచక్రవాహణదారులు, ఆటోవాలలే సమస్యకు కారణం - నియంత్రణ లేక యుటర్నల వద్ద ప్రమాధాలు
- గణనీయంగా పెరిగిన వాహణదారులు - పెరిగి జనాభాతో సమానంగా పెరగని రోడ్డు
- ఫూట్ పాత్ ఆక్రమణలపై చర్యలేవి - ట్రాఫిక్ పై ప్రజలకు అవగాహణ కల్పించాలి





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రోజు రోజుకు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ జామ్ సమస్య జఠిలంగా మారడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించి పోతుండటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన పోలీసింగ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై ప్రభుత్వానికి ఒక ఆర్థిక వనరుగా మారడంతో ఈ సమస్య తీవ్రమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, అధికార యంత్రాంగం ట్రాఫిక్ సమస్యపై మల్లగుల్లాలు పడుచున్నరు

### ప్రధాన కారణాలు

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో పాటు పరిష్కారం కాకపోవడానికి పలు ప్రధాన కారణాలు ఉన్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా విజిబుల్ పోలీసింగ్ అనేది చాలా తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా రద్దీ సమయాల్లో ప్రధాన కూడళ్ళ వద్ద సరైన నియంత్రణ లేకపోవడం. ట్రాఫిక్ పోలీసులంతా కెమెరాలతో సిగ్నల్స్ వద్ద గుమికూడి పోటోగ్రాఫర్ల పనిచేయడంతో నగరమంతా ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమై సాధారణ సమయాల్లోను ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరంలో ప్రధానంగా ట్రాఫిక్ జామ్ తీవ్రమై దాని ప్రభావం కిలోమీటర్ల మేర కనిపిస్తుండగా సంబంధిత పోలీసు అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత స్వల్పకాలిక పరిష్కారాలపై దృష్టిసారించి ఆ తర్వాత దీర్ఘకాలిక చర్యలకు ఉపక్రమిస్తే వాహనదారులకు కొంతమేర ఊరట కలుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

### ట్రాఫిక్ జాం నరకప్రాయం

నగరంలో వాహణదారులను ట్రాఫిక్ సమస్య వెంటాడుతున్నది. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు విసిగిపోతున్నారు. సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగంలోని ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్న క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలు అమలు కావడం లేదు. అసలు ట్రాఫిక్ జామ్‌లు ఎందుకు అవుతున్నాయి పరిష్కారాన్ని చూపాల్సిన భాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉంది ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడం వల్ల సమస్య కొంతమేరకు తీరుతుందని పలువురు తెలిపారు. అయినా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ప్రజల సంఖ్య పెరగడం, రోడ్ల సౌకర్యాలు సరిపోక పోవడం, వాహనాల సంఖ్య పెరగడం, అలాగే వర్షం లాంటి కారణాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, నగరాలు కొత్త రోడ్లు నిర్మించడం, పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ ను మెరుగుపరచడం, ప్రజలకు ట్రాఫిక్ గురించి అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణ లేదు

ట్రాఫిక్ సమస్యపై ఉన్నత స్థాయిలో ప్రభుత్రం, పోలీసులు ఎన్ని నిబంధనలను పెట్టినను సమస్య మరింత గాడి తప్పుతుంది. ముఖ్యంగా ద్వచక్రవాహణదారులు, ఆటోవాలల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుచున్నాయి. యూటర్నల వద్ద ఎలాంటి జాగ్రత్తలు లేకుండా ఒకేసారి వాహణాలను తిప్పడం, రాంగ్ రూట్లలో వచ్చి ట్రాఫిక్ కు అంతరాయం కల్గించడమేకాక ప్రమాధాలకు సైతం కారణమవుచున్నాయి. ముఖ్యంగా నగరంలో పెరుగుచున్న ఆటోలు ఎన్ని నిబంధనలకు లోబడి నడపబడుతున్నాయని, ఆటోవాలాలకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయా లేదా అనే దానిపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. అలాగే రాంగ్ రూట్లలో వచ్చేవారి వాహణాలను సీజ్ చేసి వాహణదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక పోలీసులు కెమెరాలను వదిలి తమ వృత్తి భాద్యతలను సక్రమంగా నిర్వర్థించాల్సి ఉంది. ఇక నగరంలో ట్రాఫిక్ చాలాన్ల మాఫియా నగరంలో ట్రాఫిక్ చాలాన్లు ఒక పెద్ద మాఫియాగా మారింది. నగరంలో సంచరించే క్యాబ్ డ్రైవర్లు, ఇతర ట్రాన్స్ పోర్ట్ వాహణాధారులు పోలీసులతో కుమ్మక్కై తమ వాహణాల ఫోటోలను కంప్యూటర్లలో లోడ్ చేయకుండా జాగ్రత్త పడుచున్నారని దీని వెనక ఒక పెద్ద యంత్రాగమే పని చేస్తుందని సమాచారు. అసలు ట్రాఫిక్ పోలీసుల భాధ్యతలేమి వారు చేస్తున్న పనేందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్యపై ప్రభుత్వం సమీక్షించి పోలీసులను పోటోగ్రాఫర్ల భాధ్యత నుంచి తప్పించి ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు

---

## శేషాచలంలో భూకేటాయింపులపై

# పవన్ సీరియస్



**అమరావతి (ప్రశ్న న్యూస్):** శేషాచలం అడవి పరిధిలో షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీకి భూమి కేటాయింపులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దాంతో ఏపీ ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ భూములు శేషాచలం వన్యప్రాణుల సంరక్షణ ప్రాంతానికి చెందినవని, అక్కడ భూకేటాయింపులు అటవీ చట్టాలకు వ్యతిరేకంగా జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దాంతో పవన్ కల్యాణ్ ఈ వ్యవహారాన్ని అధికారులతో సమీక్షించారు. భూకేటాయింపుల వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలి. కేటాయింపుల ప్రక్రియ ఎలా జరిగింది, అటవీ చట్టాలు ఉల్లంఘించారా అన్నది పరిశీలించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కు పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో శేషాచలానికి ఆనుకుని ఉన్న ఉపాధ్యాయనగర్ ప్రాంతంలో అటవీ సరిహద్దు ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. దాంతో జంతువులు నీటి కోసం జనావాసాల్లోకి వస్తున్నాయని సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలను పవన్ కళ్యాణ్ పరిశీలించి, ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ కి రిపేర్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వన్యప్రాణులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని, జంతువుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫెన్సింగ్ ధ్వంసానికి కారణాలపై కూడా ప్రత్యేకంగా నివేదిక ఇవ్వాలని కోరారు. తిరుపతిలో అటవీ శాఖ నిర్మించిన దివ్యారామం క్షేత్రంలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో చెట్లు నరకడంపై డిప్యూటీ సీఎం పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలు అటవీ నిబంధనలకు వ్యతిరేకమని, పీసీసీఎఫ్ చలపతిరావుని విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు

---

## హైదరాబాద్ పోలీసుల అదుపులో పాకిస్తానీ యువకుడు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పహల్గామ్ ఉగ్రదాడి ఘటన అనంతరం పాకిస్తాన్ పౌరుల విషయంలో భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్న విషయం విదితమే. పాక్ పౌరుల వీసాలను రద్దు చేయడంతో పాటు, దేశం విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో నిర్వహించిన సోదాల్లో పాకిస్థాన్‌కు చెందిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్న వ్యక్తి పాకిస్థాన్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్‌గా గుర్తించారు. ఇతను దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, ఇటీవలే హైదరాబాద్ పాతబస్తీకి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో తేలింది. తన భార్యను కలిసేందుకే ఫయాజ్ పాకిస్థాన్ నుంచి నేపాల్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఫయాజ్‌ను అదుపులోకి తీసుకుని, అతని ప్రయాణ వివరాలు, ఇతర సంబంధాలపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, విచారణ పూర్తయిన తర్వాత అతడిని పాకిస్థాన్‌కు తిరిగి పంపిస్తామని నగర పోలీసులు వెల్లడించారు.

---

## హైదరాబాదులో కోట్లు కొల్లగొడుతున్న

# రేషన్ మాఫియా

## - కేటుగాళ్లకు వనరుగా మారిన రేషన్ బియ్యం

- కోట్లు సంపాదిస్తున్న రేషన్ బియ్యం వ్యాపారం - "పెట్టరేగుతున్న మాఫియా
- రాత్రివేళ తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తోన్న వైనం,
- చూసీచూడనట్లు వదిలేయడానికి దండిగా మామూళ్ల చదివింపులా.? తనిఖీలకు
- చెక్‌పోస్టులకు అవినీతి చెదలు. - నగరంలో రేషన్ మాఫియా యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం - చోద్యం చూస్తున్న అధికారులు"






హైదరాబాద్( ప్రశ్న న్యూస్ )హైదరాబాద్ మహా నగరంలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. తమ అక్రమ వ్యాపారాన్ని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తోంది. అధికారుల అండదండలతో ప్రతి రోజూ వందలాది టన్నుల బియ్యంను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ముడుపులు తీసుకుని అన్నివిధాలా సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పేదల బియ్యం అక్రమ వ్యాపారం హైదరాబాద్ , తెలంగాణ లో జోరుగా సాగిపోతోంది. ఈ రేషన్ మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయి అధికారులు మా చేతిలో ఉన్నారు వారికి నెల నెల అన్ని ఇస్తున్నామంటూ దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఎక్కడ చూసిన రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. పీడీఎస్‌అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది. గ్రామాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరలకు కొనుగోలు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. మిల్లర్లు, రేషన్ డీలర్లతోనూ కుమ్మక్కై పెద్ద ఎత్తున బియ్యం రీసైక్లింగ్కు పాల్పడుతున్నారు. అధికారులు రేషన్ మాఫియాతో కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నారు అని ఆరోపణలు లేకపోలేదు. పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కార్డులు జారీ చేసి వారికి ఆసరాగా ఉండేందుకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నది. పేదల ఆకలి తీర్చాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### హైదరాబాద్‌లో బియ్యం అక్రమ నిల్వలు

హైదరాబాద్, కూకట్పల్లి, సికింద్రాబాద్, ఉప్పల్,అనేక ప్రాంతాల్లో అక్రమ రేషన్ బియ్యాన్ని నిలువచేసి రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు . ఈ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తూ రోజుకు లక్షల్లో ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నా అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు, ఇతర సమాచార వ్యవస్థల ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం అందించిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పట్టణ ప్రజలు వాపోతున్నారు. యథేచ్ఛగా బియ్యం అక్రమ వ్యాపారం సాగుతున్న విషయాన్ని కొంతమంది ఉన్నతాధికారులకు అమ్యామ్యాలకు తలోగ్గి చోద్యం చూస్తున్నారు. కొంతమంది ఎండియూ ఆపరేటర్లు ముఠాగా ఏర్పడి పేదలకు అందించాల్సిన బియ్యంకు బదులు లబ్ధిదారులకు నగదు అందజేస్తూ ఆ రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ కు లక్షల్లో విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం సరఫరా చేసే ఆపరేటర్లు ఈ రకమైన దోపిడీకి పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు పేదలకు అందించే బియ్యంలో కొలతల్లో అవకతవకలకు పాల్పడుతూ రెండు నుంచి మూడు కేజీల వరకు తగ్గించి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల స్థానికులు సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసిన తూతూ మంత్రపు చర్యలతో చేతులు దులుపుకున్నారు.

### నిత్యం టన్నుల కొద్దీ రవాణా

హైదరాబాద్ ,సికింద్రాబాద్ ,కూకట్పల్లి ,ఉప్పల్, శామీర్పేట్ నుంచి నిత్యం రేషన్ బియ్యం అక్రమ రవాణా తెలంగాణకు చెందిన బియ్యం తరలి వెళ్తోంది. అంతే కాకుండా మిగిలిన మండలాల సరిహద్దుల్లో ఉన్న సరిహద్దుల నుంచి బియ్యం ఎగుమతి చేస్తున్నారు. నిత్యం టన్నులకొద్దీ రేషన్ బియ్యాన్ని తరలించి వాటిని రీసైక్లింగ్ చేసి కోట్ల రూపాయలు కూడగడుతున్నారు రేషన్ మాఫియా. రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం తన్నులకొద్దీ యథేచ్ఛగా రేషన్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్నారు. వీరు రాత్రి వేళల్లో బియ్యాన్ని బొలెరో, లారీ, ఇంకా పెద్దపెద్ద వాహనాల్లో సరిహద్దు దాటిస్తున్నారు. అయినప్పటికీ కనీసం పట్టించుకునే వారు కరువయ్యారు.

### లక్షల్లో మామ్ముళ్లు

రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో అన్ని ప్రధాన ప్రభుత్వ శాఖల అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ పిడిఎఫ్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన పౌరసరఫరాల శాఖలోని జిల్లా స్థాయి అధికారుల నుంచి ఎన్ఫోర్స్మెంట్ విభాగంలోని వివిధ శాఖలో హెూదాలో ఉన్న వారి వరకు బియ్యం దందా సాగించే వారికి సహకారం అందిస్తున్నట్లు భావిస్తున్నారు ప్రజలు. మామూలు ఇవ్వలేని గ్రామ మండల స్థాయిలోని ఆటో ట్రాలీలను అప్పుడప్పుడు సీజ్ చేసి అధికారులు కంటిచూపు చర్యలు తీసుకుంటున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### మమ్మల్నేమీ చేయలేరంటున్న వ్యాపారులు, ఆపరేటర్లు

హైదరాబాద్ లోని కొంతమంది ముఠాగా ఏర్పడి కొన్ని ప్రాంతాల నుంచి బియ్యం స్మగ్లర్లు చేరుకొని హైదరాబాద్ సికింద్రాబాద్, కూకట్పల్లి, ఉప్పల్, శామీర్ పేట్ ఇలా పలు చోట్ల డంపింగ్ ప్రాంతాలకు చేరుకుని దర్జాగా రాత్రి పగలు తేడా లేకుండా కోట్ల రూపాయలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని దర్జాగా అక్రమ మార్గంలో తరలిస్తున్నారు.

తమకు అధికారుల అండ ఉందని, ఎవరూ ఏమీ చేయలేరని ఈ రేషన్ మాఫీయా ముఠా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే ఆపరేటర్లు పలుచోట్ల రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. సివిల్ సప్లై అధికారులు మాత్రం కోట్లల్లో అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతుంటే హైదరాబాద్ సికింద్రాబాద్ కూకట్పల్లి ఉప్పల్, శామీర్ పేట్ సివిల్ సప్లై అధికారులు ఉన్నారా.? లేరా అని పట్టణ ప్రజలు బహిరంగ విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టి, సక్రమంగా లబ్ధిదారులకు రేషన్ అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

---

## సికింద్రాబాద్‌లోని ఓ గోదాంలో

# రూ.8 కోట్ల నోట్ల గుట్టలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ ప్రాంతంలో ఓ పాత గోదాములో భారీగా నగదు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు జరిపిన తనిఖీల్లో సుమారు రూ. 8 కోట్ల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగరంలో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన సికింద్రాబాద్ నడిబొడ్డున ఇంత పెద్ద మొత్తంలో డబ్బు దొరకడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలీసు వర్గాల కథనం ప్రకారం, సికింద్రాబాద్‌లోని ఒక పాత గోదాములో పెద్ద మొత్తంలో డబ్బు నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ గోదాంపై దాడి చేసి తనిఖీలు చేపట్టారు. అక్కడ గుట్టలుగా పడి ఉన్న నోట్ల కట్టలను చూసి వారు ఆశ్చర్యపోయారు. తక్షణమే ఆ నగదును భద్రపరిచి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న నగదుపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగు చూశాయి. ఈ డబ్బంతా నగరంలోని ఏటీఎంలలో నగదు నింపే ఒక ప్రైవేట్ ఏజెన్సీకి చెందినదని పోలీసులు నిర్ధారించారు. ఆ ఏజెన్సీ తమ సిబ్బందికి గత కొంతకాలంగా జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, దీంతో ఆగ్రహించిన సిబ్బంది సుమారు వారం రోజులుగా విధులను బహిష్కరించారని తెలిసింది. సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో, ఏటీఎంలలో జమ చేయాల్సిన నగదు భారీగా ఏజెన్సీ వద్ద పేరుకుపోయిందని పోలీసులు గుర్తించారు. ఆ మొత్తాన్ని భద్రపరిచే సరైన ఏర్పాట్లు లేకపోవడం, ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఏజెన్సీ నిర్వాహకులు ఆ డబ్బును ఈ పాత గోదాములో దాచిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వివరించారు. ఈ ఘటనపై బాధ్యులైన ఏటీఎం ఏజెన్సీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588